12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నంచడం మన హక్కు
విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టీ. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక :274 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తిరుపతి శనివారం 10 అక్టోబర్ 2026 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE :274 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : TIRUPATI SAT 10 OCTOBER 2026 PRICE : 5/- RS

Simultaneously Published form Tirupati, Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur


## తమిళనాడులో టీవీకే ప్రభంజనం.. రెండు స్థానాలను గెలుచుకున్న విజయ్ పార్టీ



పెన్ పవర్ డెస్క్:తమిళనాడులో అధికార టీవీకే పార్టీ ప్రభంజన సృష్టించింది. సీఎం విజయ్ పాలనకు రెఫరెండంగా భావించిన ఉపఎన్నికల్లో ధారాపురం, మధురాం తకం స్థానాలను గెలుచుకుంది.

- మిగతా 2లో

## అర్ధరాత్రి బర్త్‌డే వేడుకలా? జాగ్రత్త.. సజ్జనార్ హెచ్చరిక!



పెన్ పవర్ డెస్క్:అర్ధరాత్రి వేళ రోడ్లపై పుట్టినరోజు వేడుకలు నిర్వహిస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ నగరవాసులకు విజ్ఞప్తి చేశారు. ట్యాంక్‌బండ్‌తో పాటు నగరంలోని

- మిగతా 2లో



# ఏపీలో స్థానిక ఎన్నికలకు లైన్ క్లియర్

### వైసీపీ పిటిషన్ కొట్టివేత

- ఏపీలో స్థానిక ఎన్నికల నిర్వహణకు సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్
- వైసీపీ దాఖలు చేసిన పిటిషన్ కొట్టివేత
- ఎస్ఐఆర్ పూర్తయ్యే వరకు వేచి ఉండాలన్న వాదనకు అంగీకరించని కోర్టు
- పాత లేదా తాజా ఓటర్ల జాబితాతో ఎన్నికలు నిర్వహించుకోవచ్చని స్పష్టీకరణ
- వార్డుల పునర్విభజనతో ఎన్నికలు ఆలస్యం చేయొద్దని వ్యాఖ్య

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమమైంది. ఎన్నికలను వాయిదా వేయాలని కోరుతూ వైసీపీ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఓటర్ల జాబితా, వార్డుల పునర్విభజన అంశాలపై కీలక స్పష్టత ఇచ్చింది. దీంతో రాష్ట్రంలో స్థానిక ఎన్నికల నిర్వహణపై ఉత్కంఠకు తెరపడినట్లయింది.ఓటర్ల జాబితాపై విచారణ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎన్నికలు నిర్వహించకూడదన్న వైసీపీ వాదనను ధర్మాసనం అంగీకరించలేదు. ఎస్ఐఆర్ తాజా జాబితా సిద్ధమైనా, పాత ఓటర్ల జాబితాతోనైనా ఎన్నికలు నిర్వహించుకోవచ్చని స్పష్టం చేసినట్లు సమాచారం.వార్డుల పునర్విభజన అంశంపైనా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఇప్పటికిప్పుడు వార్డుల పునర్విభజన చేపట్టాలని కోరడం ఎన్నికలను ఆలస్యం చేసే ప్రయత్నమేనన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. దీంతో ఎన్నికల నిర్వహణకు సంబంధించి అడ్డంకులు తొలగినట్లయింది.

- మిగతా 2లో








## రైతులు పంట గురించి ఆలోచించాలే తప్ప ఆందోళన చెందకూడదు

- ప్రకాశం జిల్లాలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన సీఎం చంద్రబాబు
- 'మీ భూమి-మీ హక్కు' కింద రాజముద్రతో కొత్త పాస్‌బుక్‌ల పంపిణీ
- రూ.166 కోట్లతో పోతుల చెంచయ్య పాలేరు రిజర్వాయర్‌కు శంకుస్థాపన
- అధికారుల పనితీరుపై బహిరంగంగా సమీక్ష.. పనితీరు మెరుగుపరుచుకోవాలని ఆదేశం
- బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వ నిబద్ధతను పునరుద్ఘాటించిన ముఖ్యమంత్రి

రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లలా పాలన సాగిస్తామని, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలం నర్సింగోలులో శుక్రవారం ఆయన పర్యటించి, 'మీ భూమి - మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా రైతులకు కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేశారు.

- మిగతా 2లో






## ఢిల్లీలో 24గంటలు ఇంటర్నెట్ బంద్

పెన్ పవర్ డెస్క్:సర్ ప్రక్రియలో అక్రమాలతో ఓట్ చోరీ చేశారని, చీఫ్ ఎలక్షన్ కమిషర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన నిరసన క్రమంలో సెంట్రల్ ఢిల్లీలో హైఅలర్ట్ ప్రకటించారు పోలీసులు. (శుక్రవారం) రాత్రం 10 నుంచి సెంట్రల్ ఢిల్లీ వ్యాప్తంగా మెట్రో స్టేషన్ల మూసివేతతోపాటు

- మిగతా 2లో

## యువతను ఎవరూ ఆపలేరు

### ఢిల్లీ ఆంక్షలపై కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ కీలక వ్యాఖ్యలు



- భారత యువతను ఎవరూ అడ్డుకోలేరన్న కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్
- ఢిల్లీలో సీజేపీ నిరసన నేపథ్యంలో రైళ్లు, మెట్రోలపై కఠిన ఆంక్షలు
- రాజధానిలో 23,000 మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు
- మెట్రో సేవలను పూర్తిగా నిలిపివేయవద్దని సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశం

- మిగతా 2లో



## విజయవాడకు విచ్చేస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

- దసరా ఉత్సవాల్లో భాగంగా ఇంద్రకీలాద్రికి రానున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- అక్టోబర్ 16న అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం చంద్రబాబు
- పది రోజుల పాటు రూ.100, రూ.300, రూ.500 దర్శన టికెట్లు రద్దు

పెన్ పవర్ డెస్క్:విజయవాడ ఇంద్రకీలాద్రిపై జరగనున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పాల్గొననున్నారు. అక్టోబర్ 14వ తేదీన ఆమె దుర్గమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయను న్నారు. ఈ నేపథ్యంలో అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. అక్టోబర్ 11 నుంచి 20వ తేదీ వరకు పది రోజుల

- మిగతా 2లో



## మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన యువ చెస్ కెరటం చల్లా నిహారిక

- మంత్రి లోకేశ్‌తో యువ చెస్ క్రీడాకారిణి నిహారిక భేటీ
- ఉమెన్ ఇంటర్నేషనల్ మాస్టర్ టైటిల్ సాధించినందుకు అభినందనలు
- ఉమెన్ గ్రాండ్‌మాస్టర్ కావడమే తన లక్ష్యమని వెల్లడించిన నిహారిక
- ప్రభుత్వపరంగా పూర్తి సహకారం అందిస్తామని లోకేశ్ హామీ

- మిగతా 2లో

## ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్నారు



పెన్ పవర్ డెస్క్: ఎస్ఐఆర్‌కు సంబంధించి కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ పెద్ద తప్పు చేశారని ఇండీ కూటమి నేతలు ఆరోపించారు. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షా, సీఈసీ ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రపతితో

- మిగతా 2లో

## దక్కని నోబెల్ 'శాంతి'.. ట్రంప్ ఏమన్నారంటే!



పెన్ పవర్ డెస్క్:నోబెల్ శాంతి బహుమతి పొందేందుకు తాను అర్హుడనని.. అది తనకు వస్తుందనే నమ్మకం మాత్రం తక్కువేనని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో దక్షిణాఫ్రికాకు చెందిన నవనీతమ్ పిళ్లైకు

- మిగతా 2లో



## జనసేన ఎమ్మెల్యే బాలరాజుపై పవన్ కల్యాణ్ సీరియస్..

### విచారణకు కమిటీ

- పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజుపై విచారణకు కమిటీ
- జనసేన అధినేత పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు జారీ
- బాలరాజు వ్యవహారశైలిపై తీవ్ర అసంతృప్తితో ఉన్న పవన్
- గతంలో హెచ్చరించినా తీరు మారకపోవడంతో ఆగ్రహం
- కమిటీ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని ప్రకటన

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

## ఎల్‌నినో అతి తీవ్రం కాబోతోందా? బలమైన ఎల్ నినో ఇదేనట

ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న ఎల్‌నినో వేగంగా బలపడుతోంది. దీనివల్ల చాలా ప్రాంతాల్లో సాధారణం కన్నా అధిక ఉష్ణోగ్రతలు నమోదుకానున్నాయి. ఈ మేరకు ప్రపంచ వాతావరణ సంస్థ హెచ్చరికలు జారీ చేసింది. డిసెంబరులో ఎల్‌నినో గరిష్ఠ స్థాయికి చేరుకోనుందని తెలిపింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకూ ఈ వాతావరణం ఇలాగే కొనసాగడానికి 100 శాతం అవకాశాలు ఉన్నాయని వివరించింది. దీంతో 1950 తర్వాత అత్యంత బలమైన ఎల్‌నినోగా ఇది నిలిచిపోయే అవకాశం ఉందని వివరించింది.

**కాంక్రీట్ జంగిల్ గా ...**

కాంక్రీట్ జంగిల్ గా మారుతున్న ప్రపంచంతో పాటు, అడవుల నరికివేతతో వాతావరణ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. అందుకే గతంలో ఎన్నడూ లేని విధంగా ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. వాతావరణ మార్పుల ప్రభావాన్ని ఇది తీవ్రం చేస్తుందని తెలిపింది. అక్టోబరు నుంచి డిసెంబరు మధ్య కాలంలో.. ఎల్‌నినోకు కేంద్ర బిందువుగా ఉన్న మధ్య, తూర్పు ఉష్ణమండల పసిఫిక్ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో.. సాధారణం కన్నా 3.7 డిగ్రీల సెల్సియస్ మేర పెరగొచ్చని పేర్కొంది.

**వేడి తీవ్రత ఎక్కువయి...**

ఈ పరిణామాలపై ప్రపంచవ్యాప్తంగా వాతావరణ నిపుణులు కూడా ఆందోళన వ్యక్తంచేశారు. నానాటికీ తీవ్రమవుతున్న ఎల్‌నినో వల్ల పసిఫిక్ మహా సముద్రంలో నిక్షిప్తమైన ఉష్ణం బయటకు విడుదలవుతుందని తెలిపారు. దీనివల్ల భూమి పై చాలా భాగం తీవ్ర ఉష్ణోగ్రతలతో అల్లాడుతుందని పేర్కొన్నారు. శీతాకాలంలో గరిష్ఠ శక్తిని సంతరించుకునే దిశగా ఎల్‌నినో సాగుతుందని ని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. .ఎల్‌నినో వల్ల జూన్–సెప్టెంబరు మధ్య భారత్‌లో దీర్ఘకాల సరాసరి వర్షపాతంతో పోలిస్తే 87.4 శాతం మేర మాత్రమే వానలు పడ్డాయి. ఈ ప్రభావంతో దేశంలో పర్యావరణంపై ప్రభావం పడుతుంది. కరవు, అసాధారణ వేడి పరిస్థితులకు ఆస్కారం పెరుగుతుందన్న ఆందోళన వ్యక్తమవుతుంది.

## ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్నారు

- మొదటి పేజి తరువాయి

భేటీ అనంతరం ఇండీ కూటమి నేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ, మమతా బెనర్జీ, ప్రియాంకగాంధీ తదితరులు మీడియాతో మాట్లాడారు. "ఓటు చోరీకి సంబంధించి రాష్ట్రపతికి వివరించాం. ఓట్ల చోరీ ఎక్కడెక్కడ జరిగిందో రాష్ట్రపతి ఆధారాలు అడిగారు. వాటిని అందజేశాం. బ్యాలెట్ పత్రాల ద్వారానే ఎన్నికలు జరపాలని కోరాం. ఓట్ల చోరీ జరుగుతోందని దేశం మొత్తానికి తెలుసు. సీఈసీ కార్యాలయం నుంచే అన్ని చోరీలు జరుగుతున్నాయి." అని రాహుల్ గాంధీ

## విజయవాడకు విచ్చేస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

- మొదటి పేజి తరువాయి

పాటు ఈ ఉత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి.రాష్ట్రపతితో పాటు, ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా అమ్మవారిని దర్శించుకోనున్నారు. అక్టోబర్ 16న మూలా నక్షత్రం రోజున ఆయన రాష్ట్ర ప్రభుత్వం తరఫున కనకదుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. ఈ ఉత్సవాలకు సుమారు 20 లక్షల నుంచి 25 లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు.భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ దర్శన టికెట్ల విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. ఉత్సవాలు జరిగే పది రోజుల పాటు రూ.100, రూ.300, రూ.500 ధర గల దర్శన టికెట్లను పూర్తిగా రద్దు చేసింది. కేవలం ఉచిత దర్శనంతో పాటు, త్వరితగతిన దర్శనం కోరుకునే వారి కోసం రూ.1000 ప్రత్యేక శీఘ్రదర్శనం టికెట్‌ను మాత్రమే అందుబాటులో ఉంచింది. ఈ టికెట్లను 'మన మిత్ర' వాట్సాప్ సేవ ద్వారా పొందవచ్చని అధికారులు తెలిపారు.సామాన్య భక్తులకు ఇబ్బంది లేకుండా దర్శనం కల్పించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని, ఉదయం 6 నుంచి 8 గంటల వరకు మాత్రమే ప్రోటోకాల్, వీఐపీ దర్శనాలకు సమయం కేటాయించినట్లు ఆలయ ఈవో వి.కె. శీనా నాయక్ తెలిపారు. రద్దీని బట్టి సాయంత్రం వేళ కూడా వీఐపీ దర్శనాలకు మరో స్లాట్ కేటాయించే అవకాశం ఉందని వివరించారు. భక్తుల కోసం భారీ క్యూ కాంప్లెక్స్‌లు, ఇతర మౌలిక సదుపాయాలను సిద్ధం చేశారు.

# రైతులు పంట గురించి ఆలోచించాలే తప్ప ఆందోళన చెందకూడదు

- మొదటి పేజి తరువాయి

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ, దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. రైతు పొలంలో పంట గురించి ఆలోచించాలి గానీ, తన భూమి భద్రతపై ఆందోళన చెందకూడదన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు.

**భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం**

గత ప్రభుత్వ హయాంలో భూ రికార్డుల విషయంలో జరిగిన అవకతవకలను సరిదిద్ది, రైతులకు పూర్తి భద్రత కల్పిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. "మీ భూమి మీదే, హక్కు మీదే, ఆ హక్కును కాపాడే బాధ్యత మాది. అందుకే పాత పాస్‌బుక్‌లపై నాయకుల బొమ్మలు తొలగించి, ప్రభుత్వ రాజముద్రతో గ్యారెంటీ ఇస్తున్నాం" అని అన్నారు. వివాదాస్పద ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేశామని, రైతులను తీవ్రంగా ఇబ్బంది పెట్టిన 22ఏ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించామని వివరించారు.

రాష్ట్రవ్యాప్తంగా 16.48 లక్షల ఎకరాలను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించామని, ప్రకాశం జిల్లాలోనే 3,304 ఎకరాల భూ సమస్యలను పరిష్కరించి 7,980 కుటుంబాల ఆశలను నిజం చేశామని తెలిపారు. గర్భకంద్రిగ వంటి ఏళ్లనాటి భూములకు సైతం విముక్తి కల్పించామన్నారు. భూ రికార్డులన్నీ డిజిటలైజ్ చేసి, బ్లాక్‌చైన్ టెక్నాలజీతో భద్రపరిచామని, రైతులు తమ ఇంటి నుంచే తమ భూమి వివరాలను ఫోన్‌లో చూసుకోవచ్చని చెప్పారు. ప్రతి నెలా 9వ తేదీన ఈ కార్యక్రమ పురోగతిని తానే స్వయంగా సమీక్షిస్తానని, అవినీతికి ఆస్కారం లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు.

**ప్రాజెక్టులకు శంకుస్థాపన.. అభివృద్ధికి బాటలు**

ఈ పర్యటనలో భాగంగా, ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పోతుల చెంచయ్య పాలేరు రిజర్వాయర్ నిర్మాణానికి, పాలేరు నదిపై హైలెవల్ వంతెన నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టుల ద్వారా 9,500 ఎకరాలకు సాగునీరు, 15 గ్రామాల్లోని 30,000 మందికి తాగునీరు అందుతుందని తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టు ఫేజ్–1ను నీళ్లు విడుదల చేశాకే జాతికి అంకితం చేశామని, ఫేజ్–2ను కూడా పూర్తి చేసి ఏటా నీళ్లిచ్చే బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాబోయే మూడేళ్లలో రూ.36 వేల కోట్లతో 35 ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. రామాయపట్నం పోర్టును వేగంగా పూర్తి చేస్తున్నామని, బీపీసీఎల్ రూ.50 వేల కోట్ల పెట్టుబడితో ఈ ప్రాంత రూపురేఖలు మారనున్నాయని అన్నారు. దోనకొండను కీలక పారిశ్రామిక టౌన్‌షిప్‌గా తీర్చిదిద్దుతామని ప్రకటించారు.

**వేదికపైనే 'పబ్లిక్ ఆడిట్'.. అధికారులకు చురకలు**

ఈ సభలో అందరి దృష్టినీ ఆకర్షించిన ప్రధాన ఘట్టం.. చంద్రబాబు వేదికపైనే నిర్వహించిన 'పబ్లిక్ ఆడిట్'. జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులను వేదికపైకి పిలిచి, ప్రజా స్పందన ఆధారంగా రూపొందించిన పనితీరు గణాంకాలను (పెర్ఫార్మెన్స్ డేటా) చదివి వినిపించారు. రాష్ట్ర సగటుతో పోలిస్తే ప్రకాశం జిల్లా, కొండేపి నియోజకవర్గం ఏయే అంశాల్లో వెనుకబడి ఉందో అంకెలతో సహా వివరించారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా (−7.93%), రవాణా శాఖ పన్నులు (−7.32%), రీ–సర్వే (−7.53%), అంగన్‌వాడీ సేవలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వంటి అంశాల్లో ప్రతికూల పనితీరుపై అధికారులను నేరుగా ప్రశ్నించారు. "మీరు సరిగా పనిచేయకపోతే ప్రజలు నన్ను నిందిస్తారు. మీవల్ల నేను మాట పడాలా? పనితీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవు" అని తీవ్ర స్వరంతో హెచ్చరించారు. అదే సమయంలో గృహ నిర్మాణం (హౌసింగ్), ఇసుక సరఫరా, మత్స్యకార భరోసా వంటి అంశాల్లో మెరుగైన పనితీరు కనబరిచిన అధికారులను అభినందించారు.

నాలుక చెప్పిందని కాకుండా, మంచి ఆహారం తీసుకోవాలి

రాష్ట్ర ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చంద్రబాబు తెలిపారు. ఆరోగ్యమే అసలైన సంపద అని, తాను రోజూ మూడు కోడిగుడ్లలోని తెల్లసొనతో చేసిన ఆమ్లెట్ తింటానని, అదే తన ఆరోగ్య రహస్యమని చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ వంటగదినే ఔషధశాలగా మార్చుకోవాలని, నాలుక చెప్పిందని కాకుండా శరీరానికి ఏది మంచిదో అదే తినాలని సూచించారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరి ఆరోగ్య రికార్డులను డిజిటలైజ్ చేసి, సరైన సమయంలో మందులు వేసుకునేలా గుర్తుచేసే వ్యవస్థను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.

**సంక్షేమం, రాజకీయ అంశాలపై వ్యాఖ్యలు**

ఎన్డీఏ ప్రభుత్వం డబుల్ ఇంజన్ సర్కార్ వేగంతో పనిచేస్తోందని, త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచి ట్రిబుల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్రాన్ని

మరింత వేగంగా అభివృద్ధి పథంలో నడిపిస్తామని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. సూపర్ సిక్స్ పథకాలైన పెన్షన్ల పెంపు, తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏటా మూడు ఉచిత సిలిండర్లు, అన్నదాత సుఖీభవ వంటివి విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. బీసీ రిజర్వేషన్ల అంశాన్ని ప్రస్తావిస్తూ, తాము 34 శాతానికి పెంచితే, ప్రత్యర్థులు కోర్టులకు వెళ్లి అడ్డుకున్నారని ఆరోపించారు. కోర్టు తీర్పు ఎలా ఉన్నా, పార్టీపరంగా 34 శాతం కంటే ఎక్కువ సీట్లు బీసీలకు ఇచ్చి వారి రాజకీయ ఎదుగుదలకు అండగా ఉంటామని స్పష్టం చేశారు.

**నేను నీతిమంతుడిగా ఉంటే సరిపోదు**

నీతివంతమైన రాజకీయాలు చేయడమే తన లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. "నేను నీతివంతుడిగా ఉంటే సరిపోదు, నా కింద పనిచేసే అధికార యంత్రాంగం, రాజకీయ నాయకులు కూడా అవినీతికి దూరంగా ఉండాలి. చిత్రగుప్తుడిలా అందరి ఖాతాలను రాసుకుంటున్నాను. ప్రజలకు ఇబ్బంది కలిగించే ఎవరినైనా ఉపేక్షించేది లేదు. పిల్లి కళ్లు మూసుకొని పాలు తాగితే ఎవరికీ తెలియదనుకోవడం భ్రమ. నేను 360 డిగ్రీల కోణంలో అందరినీ గమనిస్తున్నాను" అని హెచ్చరించారు. ప్రజాసేవకుడిగా ప్రజల బాగోగులే తనకు ముఖ్యమని, దేశభక్తిని, రాష్ట్రంపై అభిమానాన్ని పిల్లలకు చిన్నతనం నుంచే నేర్పించాలని కోరారు. అంతిమంగా, ఆర్థిక అసమానతలు లేని సమాజాన్ని నిర్మించడమే తన ఆశయమని చంద్రబాబు పునరుద్ఘాటించారు.

## జనసేన ఎమ్మెల్యే బాలరాజుపై పవన్ కల్యాణ్ సీరియస్..

జనసేన పార్టీకి చెందిన పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజుపై వస్తున్న ఆరోపణల వ్యవహారంపై డిప్యూటీ సీఎం, పార్టీ అధినేత పవన్ కల్యాణ్ తీవ్రంగా స్పందించారు. బాలరాజుపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపేందుకు పవన్ కల్యాణ్ ఒక ఉన్నత స్థాయి కమిటీని నియమిస్తున్నట్లు జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ నిర్ణయం పార్టీలో అంతర్గతంగా కలకలం రేపుతోంది.గత కొంత కాలంగా ఎమ్మెల్యే బాలరాజు వ్యవహారశైలి, పనితీరుపై పవన్ కల్యాణ్ తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఇటీవల మీడియాలో ఆయనపై ఆరోపణలు రావడంతో ఈ వ్యవహారాన్ని అధిష్ఠానం సీరియస్‌గా తీసుకుంది. గతంలోనే బాలరాజును పార్టీ కార్యాలయానికి పిలిపించి, గిరిజన ప్రజలకు పారదర్శకమైన, నీతివంతమైన పాలన అందించాలని, వారి సేవకే అంకితం కావాలని పవన్ కల్యాణ్ వ్యక్తిగతంగా సూచించారు. అయినప్పటికీ ఆయన ప్రవర్తనలో మార్పు రాకపోవడంపై పవన్ తీవ్ర అసహనం, విసుగుతో ఉన్నట్లు పార్టీ ప్రకటనలో పేర్కొన్నారు.ఓవైపు 'అడవితల్లి బాట' వంటి కార్యక్రమాల ద్వారా గిరిజన ప్రాంతాల అభివృద్ధికి పార్టీ కృషి చేస్తుంటే, అదే గిరిజన ప్రాంతం నుంచి ఎన్నికైన ప్రజాప్రతినిధి వ్యవహారశైలిపై వస్తున్న ఆరోపణలు పార్టీకి ఇబ్బందికరంగా మారాయి. ఈ నేపథ్యంలోనే పవన్ కల్యాణ్ ఈ విచారణకు ఆదేశించినట్లు తెలుస్తోంది.ఈ కమిటీ క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, వాస్తవాలను నిగ్గు తేల్చి, పార్టీ అధ్యక్షుడికి నివేదిక సమర్పించనుంది. ఆ నివేదిక ఆధారంగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజుపై తదుపరి చర్యలు ఉంటాయని జనసేన పార్టీ స్పష్టం చేసింది. దీంతో బాలరాజు రాజకీయ భవిష్యత్తుపై ఉత్కంఠ నెలకొంది.

## మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన యువ చెస్ కెరటం చల్లా నిహారిక

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యువ చెస్ క్రీడాకారిణి, ఉమెన్ ఇంటర్నేషనల్ మాస్టర్ చల్లా నిహారిక రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిసింది. శుక్రవారం ఉండవల్లిలోని మంత్రి నివాసంలో ఆమె తన కుటుంబ సభ్యులతో కలిసి లోకేశ్‌తో భేటీ అయింది. ఇటీవలే ప్రతిష్ఠాత్మక ఫిడే ఉమెన్ ఇంటర్నేషనల్ మాస్టర్ హోదాను సాధించిన నిహారికను ఈ సందర్భంగా మంత్రి ప్రత్యేకంగా అభినందించారు.ఈ భేటీలో నిహారిక సాధించిన విజయాలను మంత్రి లోకేశ్ ప్రశంసించారు. చిన్న వయసులోనే అంతర్జాతీయ స్థాయిలో నిలకడగా రాణిస్తూ రాష్ట్రానికి గర్వకారణంగా నిలుస్తున్నారని కొనియాడారు. నిహారిక ప్రతిభ, పట్టుదల భవిష్యత్తులో ఎందరో యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలుస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా తన భవిష్యత్ లక్ష్యాలను నిహారిక మంత్రికి వివరించింది. ఉమెన్ గ్రాండ్‌మాస్టర్ టైటిల్ సాధించడమే తన తదుపరి లక్ష్యమని ఆమె స్పష్టం చేసింది. ఆమె ఆకాంక్షలను విన్న మంత్రి లోకేశ్, లక్ష్యసాధనలో ప్రభుత్వం తరఫున అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. శిక్షణ, అంతర్జాతీయ టోర్నమెంట్లలో పాల్గొనడానికి అవసరమైన పూర్తి సహకారాన్ని అందిస్తామని భరోసా కల్పించారు. ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించడమే తమ ప్రభుత్వ విధానమని ఆయన పునరుద్ఘాటించారు.

## అర్ధరాత్రి బర్త్‌డే వేడుకలా? జాగ్రత్త.. సజ్జనార్ హెచ్చరిక!

- మొదటి పేజి తరువాయి

ప్రధాన రహదారులు, చెరువులు, పార్కుల వద్ద అర్ధరాత్రి కేక్ కటింగ్‌లు చేయొద్దని స్పష్టం చేశారు. సరదా కోసం చేసే చిన్నపాటి నిర్లక్ష్యం కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.మూడు రోజుల క్రితం అర్ధరాత్రి 2 గంటల సమయంలో ట్యాంక్‌బండ్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరేళ్ల చిన్నారి, ఆమె బంధువు ప్రాణాలు కోల్పోయారు. చిన్నారి పుట్టినరోజు వేడుకల సమయంలో ఈ విషాదం చోటుచేసుకుంది. సమాచారం అందిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. ప్రాణాలు కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయిందని సజ్జనార్ తెలిపారు.ఈ ఘటన నేపథ్యంలో ట్యాంక్‌బండ్‌లో ప్రమాదాలు జరిగే ప్రాంతాన్ని ఉన్నతాధికారులతో కలిసి పరిశీలించినట్లు చెప్పారు. ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టామని, సంబంధిత ప్రభుత్వ శాఖలతోనూ సమీక్ష నిర్వహించామని వెల్లడించారు.అర్ధరాత్రి వేళ రోడ్లపై పాదచారుల రాకపోకలు తక్కువగా ఉండటంతో వాహనాలు వేగంగా వెళుతుంటాయని సజ్జనార్ హెచ్చరించారు. అలాంటి సమయంలో చిన్నపిల్లలను వెంటబెట్టుకుని రోడ్ల మధ్యకు రావడం ప్రమాదకరమన్నారు. పుట్టినరోజు వేడుకలు కుటుంబ సభ్యుల మధ్య ఇంట్లో లేదా సురక్షితమైన ప్రదేశాల్లో నిర్వహించుకోవాలని సూచించారు.ట్యాంక్‌బండ్‌పై వేడుకలు నిర్వహించడంపై ఇప్పటికే జీహెచ్‌ఎంసీ నిషేధాజ్ఞలు ఉన్నాయని గుర్తుచేశారు. పోలీసులు నిరంతరం గస్తీ నిర్వహిస్తూ, వేడుకల కోసం అక్కడికి వచ్చే వారిని వెనక్కి పంపిస్తున్నా, మళ్లీ అర్ధరాత్రి వేడుకలకు వస్తుండటంతో ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని పేర్కొన్నారు. క్షణకాలపు ఆనందం కోసం విలువైన ప్రాణాలను కోల్పోవద్దని, ఇకపై ట్యాంక్‌బండ్, చెరువులు, బహిరంగ ప్రదేశాల్లో అర్ధరాత్రి వేడుకలు నిర్వహించవద్దని నగరవాసులకు విజ్ఞప్తి చేశారు.

## ఢిల్లీలో 24గంటలు ఇంటర్నెట్ బంద్

- మొదటి పేజి తరువాయి

ఇంటర్నెట్ సేవలను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

అక్టోబర్ 10న సీజేపీ, విద్యార్థి సంఘాల నిరసనలకు అనుమతి లేదని ఢిల్లీ పోలీసులు స్పష్టం చేశారు. గతంలో జరిగిన నిరసనల్లో రూల్స్ ఉల్లంఘించినందుకు తాజా నిరసనలకు అనుమతి నిరాకరించారు.ముందస్తు చర్యల్లో భాగంగా మెట్రో స్టేషన్ల మూసివేత, ఇంటర్నెట్ సేవల నిలిపివేత, భారీ బందోబస్తు చేపట్టినట్లు తెలిపారు.

మరోవైపు ఢిల్లీలోని 57 మెట్రోస్టేషన్లను మూసివేస్న?నట్లు ఐవీ=జ ప్రకటించింది. పోలీసుల ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రినుంచే సెంట్రల్ ఢిల్లీలోని మెట్రో స్టేషన్లలో రాకపోకలను

నిలిపివేస్తున్నట్లు తెలిపింది. న్యూఢిల్లీ జిల్లాలోని జంతర్ మంతర్ తో పాటు ఇతర కీలక ప్రాంతాల్లో నిరసనల్లో పాల్గొనేందుకు నిరసనల కారులు భారీ ఎత్తున తరలివచ్చే అవకాశం ఉందని గుర్తించిన మెట్రో స్టేషన్లలో అవసరమైన చర్యలు తీసుకోవాలని ఢిల్లీ పోలీసులు DMRC ని కోరారు.

## యువతను ఎవరూ ఆపలేరు

రైళ్లను రద్దు చేయడం ద్వారానో, రవాణా మార్గాలను నిలిపివేయడం ద్వారానో దేశ యువతను ఎవరూ ఆపలేరని కేంద్ర మంత్రి, లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) అధినేత చిరాగ్ పాశ్వాన్ అన్నారు. ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) శనివారం తలపెట్టిన నిరసన కార్యక్రమం నేపథ్యంలో రైళ్లు, మెట్రోలపై విధించిన ఆంక్షలపై ఆయన ఈ విధంగా స్పందించారు. శుక్రవారం కుండ్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ ఆంత్రప్రెన్యూర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్ (నిఫ్టెమ్) ఏడో స్నాతకోత్సవంలో పాల్గొన్న అనంతరం చిరాగ్ పాశ్వాన్ విలేకరులతో మాట్లాడారు. "వీరు భారత యువత, వీరిని ఎవరూ ఆపలేరు. ఎన్ని రైళ్లను ఆపగలరు? రవాణా సౌకర్యాలను ఎంతవరకు నిలిపివేయగలరు? ఎన్ని రోడ్లను దిగ్బంధించగలరు? ప్రపంచానికే దిశానిర్దేశం చేసే సత్తా భారత యువతకు ఉంది. అటువంటి పరిస్థితుల్లో వారిని ఎవరూ అడ్డుకోలేరు" అని ఆయన వ్యాఖ్యానించారు.సీజేపీ నిరసన కారణంగా న్యూఢిల్లీ, హజ్రత్ నిజాముద్దీన్ రైల్వే స్టేషన్లకు శనివారం ఉదయం 4 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల మధ్య రావాల్సిన, వెళ్లాల్సిన పలు రైళ్లను భారతీయ రైల్వే రద్దు చేయడంతో పాటు మరికొన్నింటి షెడ్యూళ్లను మార్చింది. ఈ నిరసన నేపథ్యంలో రాజధానిలో 23,000 మందికి పైగా భద్రతా సిబ్బందిని మోహరించి నగరాన్ని ఒక ఇనుప కోటలా మార్చేశారు.గతంలో నిర్వహించిన నిరసనల సందర్భంగా నిర్వాహకులు చట్టపరమైన ఆదేశాలను పాటించడంలో విఫలమయ్యారని పేర్కొంటూ, ఢిల్లీ పోలీసులు ఈసారి నిరసనకు అనుమతి నిరాకరించారు. అంతేకాకుండా, 57 మెట్రో స్టేషన్లను మూసివేయాలని ప్రతిపాదించారు. పోలీసుల ప్రతిపాదన మేరకు, శుక్రవారం రాత్రి 9 గంటల నుంచి తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు ఈ స్టేషన్లలో ప్రవేశ, నిష్క్రమణలను నిలిపివేస్తున్నట్లు ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ (డీఎంఆర్‌సీ) తొలుత ప్రకటించింది.అయితే, ఈ వ్యవహారంలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకుంది. శనివారం నాటి నిరసనను దృష్టిలో ఉంచుకుని మెట్రో రైలు సేవలను పూర్తిగా నిలిపివేయరాదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ప్రజలకు అసౌకర్యం కలగకుండా, అవసరమైన నియంత్రణలతో మెట్రో, ఇతర రైల్వే సేవలు కొనసాగేలా చూడాలని కేంద్రాన్ని ఆదేశించింది.

## దక్కని నోబెల్ 'శాంతి'.. ట్రంప్ ఏమన్నారంటే!

- మొదటి పేజి తరువాయి

ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు రావడంపై ట్రంప్ పరోక్షంగా స్పందించారు. ఆయనకు మద్దతుగా ఓ సీనియర్ న్యాయవాది ట్రూత్ సోషల్‌లో పెట్టిన పోస్టును రీపోస్టు చేసిన ఆయన.. నోబెల్ శాంతి దక్కకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు."అమెరికా, ఇజ్రాయెల్‌ను బహిరంగంగా ద్వేషించే వ్యక్తి నవనీతమ్ పిళ్లై. శాంతిని పెంపొందించడానికి ఆమె ఎన్నడూ ప్రయత్నించలేదు. రష్యా, ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించడానికి.. ఇరాన్‌ను అడ్డుకోవడానికి ట్రంప్ శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు. గాజాను పునర్నిర్మించడానికి కృషి చేస్తున్నారు. అసాధ్యం అనుకున్న అబ్రహం ఒప్పందాన్ని అందించారు. ఇప్పుడు దాన్ని విస్తరిస్తున్నారు. నోబెల్ శాంతి బహుమతికి ఇలాంటి విషయాలను గుర్తించాల్సింది" అని అమెరికాకు చెందిన సీనియర్ అటార్నీ డేవిడ్ షోయెన్ పెట్టిన పోస్టుపై ట్రంప్ స్పందించారు.

## తమిళనాడులో టీవీకే ప్రభంజనం..

### రెండు స్థానాలను గెలుచుకున్న విజయ్ పార్టీ

- మొదటి పేజి తరువాయి

2026 అక్టోబర్ 9న జరిగిన కౌంటింగ్ లో ముందునుంచీ టీవీకే అభ్యర్థులు లీడ్ లో కొనసాగుతూ చివరికి విజయం సాధించారు. ధారాపురం నియోజకర్గంలో టీవీకే అభ్యర్థి సత్యభామ గెలుపొందారు. మొత్తం 23 రౌండ్ల కౌంటింగ్ తర్వాత సత్యభామ 9 వేల 471 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఆమెకు మొత్తం 66 వేల 841 ఓట్లు వచ్చాయి. అంటే 37.02 శాతం ఓట్లతో గెలుపొందారు. ఇక డీఎంకే 57 వేల 370 ( 31.78%) ఓట్లతో రెండో స్థానంలో నిలవగా.. అన్నాడీఎంకే 45 వేల 280 ( 25.08%) ఓట్లు సాధించింది. ధారాపురంలో జనరల్ ఎలక్షన్లలో 40 వేల ఓట్లతో ఓడిన టీవీకే.. ఇప్పుడు దాదాపు పదివేల ఓట్ల తేడాతో గెలుపొందటం గమనార్హం. ఇక మధురాంతకంలో 19 వేల 241 ఓట్లతో టీవీకే అభ్యర్థి మరగతం కుమారవేల్ విజయాన్ని అందుకున్నారు. దీంతో పార్టీ కార్యకర్తలు స్వీట్లు పంచుతూ పార్టీ విజయాన్ని సెలబ్రేట్ చేసుకున్నారు.ఇక తమ పాలనకు రెఫరెండంగా భావించి ఉపఎన్నికలకు వెళ్లిన టీవీకే.. తమ పాలనపై ప్రజలకు విశ్వాసం ఉందని.. ప్రజలు సంతృప్తిగా ఉన్నారని భావిస్తోంది. పార్టీ గెలుపుతో కార్యకర్తలు సంబరాలు చేసుకుంటున్నారు.

# ఏపీ లో బీసీలకు 34 శాతం సీట్లు ఇస్తాం.- మంత్రి లోకేష్

**నెల్లూరు అక్టోబర్ 9 పెన్ పవర్ స్టేట్ బ్యూరో**

కోర్టు కొట్టేసినా...పార్టీ తీసుకున్న నిర్ణయం ప్రకారం రాష్ట్రం లో బీసీలకు 34 శాతం సీట్లు ఇస్తామని మంత్రి లోకేశ్ స్పష్టీకరణ.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్ల అంశంపై తెదేపా పూర్తి స్పష్టతతో ఉందని మంత్రి లోకేశ్ తెలిపారు. కోర్టు తీర్పు ఎలా ఉన్నా పార్టీపరంగా 34 శాతానికిపైగా స్థానాల్ని బీసీలకు కేటాయిస్తామని ఆయన స్పష్టంచేశారు. గురువారం తెదేపా కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. వైకాపా నెల్లూరు మేయర్ అభ్యర్థిని ప్రకటించడాన్ని విలేకరులు ప్రస్తావించగా... రిజర్వేషన్లు ఖరారు కాకుండానే అభ్యర్థిని ప్రకటించిన ఘనత గొడ్డలి పార్టీకే దక్కిందన్నారు. బీసీ రిజర్వేషన్లను అడ్డుకునేందుకు గొడ్డలి పార్టీ చేస్తున్న కుట్రల్ని అందరూ చూస్తున్నారని, వైకాపా ఓటమి భయంతోనే స్థానిక ఎన్నికల్ని అడ్డుకునేందుకు సుప్రీంకోర్టు వరకు వెళ్లిందని ఆయన వ్యాఖ్యానించారు.

ఖాళీ అయిన నామినేటెడ్ పదవుల భర్తీపై స్థానిక ఎన్నికలు పూర్తయ్యాక సమీక్షిస్తామని, బాగా



పనిచేసినవారికే పదవుల రెన్యువల్ ఉంటుందని చెప్పారు.

# పేదల ఆరోగ్యానికి సీఎం సహాయనిధి భరోసా-మంత్రి నారాయణ







- నెల్లూరు సిటీలో 50 మందికి రూ.31.34 లక్షల ఆర్థిక సాయం అందజేసిన మంత్రి నారాయణ
- ఇప్పటివరకు 579 మందికి రూ.5.19 కోట్లకు పైగా సాయం

**నెల్లూరు:అక్టోబర్ 9 పెన్ పవర్ నెల్లూరు బ్యూరో**

ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ఆర్థిక భరోసాగా నిలుస్తోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పేర్కొన్నారు. అనారోగ్యంతో ఇబ్బందులు పడుతూ వైద్య ఖర్చులు భరించలేని పేదలకు సీఎం సహాయనిధి అండగా నిలుస్తోందన్నారు. నెల్లూరు సిటీ నియోజకవర్గంలోని లబ్ధిదారులకు శుక్రవారం చింతారెడ్డిపాలెంలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 50 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 31,34,707 విలువైన చెక్కులను అందజేశారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న కుటుంబాలకు ఈ సాయం ఊరటనిస్తుందని మంత్రి పేర్కొన్నారు. అర్హులైన వారికి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారుల చేతికే చెక్కులు అందజేస్తున్నట్లు తెలిపారు.

నెల్లూరు సిటీ నియోజకవర్గంలో ఇప్పటివరకు 579 మందికి రూ. 5,19,34,509 విలువైన సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. పేదల ఆరోగ్యానికి భరోసా కల్పించేందుకుముఖ్యమంత్రిచంద్రబాబునాయుడు ఆర్థికఇబ్బందులనుపరిగణనలోకితీసుకుని,సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం అందిస్తున్నారని తెలిపారు.

అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పేదలకు అడిగిన వెంటనే ఆర్థిక సాయం మంజూరు చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు మంత్రి నారాయణ కృతజ్ఞతలు తెలిపారు. వైద్య ఖర్చుల భారం కారణంగా ఏ పేద కుటుంబమూ ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశంతో సీఎం సహాయనిధి ద్వారా బాధితులకు అండగా నిలుస్తున్నట్లు పేర్కొన్నారు.

# ఏసీ నగర్ ప్రభుత్వ హైస్కూల్‌కు కార్పొరేట్ హంగులు







- రూ.9.69 కోట్ల సీఎస్ఆర్ నిధులతో మల్లెల సంజీవయ్య స్కూల్ ఆధునికీకరణకు ముందుకొచ్చిన జిగ్మా కంపెనీపనులకు శంకుస్థాపన చేసిన మంత్రి నారాయణ

**నెల్లూరు, అక్టోబరు 9 పెన్ పవర్ స్టేట్ బ్యూరో**

పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరు సిటీ నియోజకవర్గంలోని ఏసీ నగర్‌లో ఉన్న మల్లెల సంజీవయ్య ప్రభుత్వ హైస్కూల్‌ను రూ. 9.69 కోట్ల సీఎస్ఆర్ నిధులతో ఆధునికీకరించేందుకు జిగ్మా కంపెనీ ముందుకొచ్చిందని వెల్లడించారు. శు క్రవారం తన కుమార్తె పొంగూరు షరణితో కలిసి పాఠశాల ఆధునికీకరణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.

పాఠశాలకు చేరుకున్న మంత్రి నారాయణకు విద్యార్థులు ఘనస్వాగతం పలికారు. విద్యాప్రదాతకు పూలవర్షంతో స్వాగతం పలికి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం నూతన విద్యాకమిటీ సభ్యులను మంత్రి సన్మానించారు.

ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా నిలిచిపోయిన అభివృద్ధి పనులనుముఖ్య మంత్రిచంద్రబాబునాయుడు సహకారంతో తిరిగి ప్రారంభించామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి,

పేద విద్యార్థులకు మెరుగైన విద్యావకాశాలు కల్పించడమే తన లక్ష్యమన్నారు. విద్య ద్వారానే సమాజంలో సమూల మార్పు సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అందుబాటులోకి వస్తున్న ఆధునిక సదుపాయాలను విద్యార్థులు

సద్వినియోగం చేసుకుని బాగా చదివి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

**విద్యతోనే పేదరికంపై విజయం**

మంత్రి కుమార్తె పొంగూరు షరణి మాట్లాడుతూ తన తండ్రి స్టాటిస్టిక్స్‌లో గోల్డ్ మెడలిస్ట్ అని, విద్యకు ఆయన ఎంత ప్రాధాన్యమిస్తారో అందరికీ తెలుసన్నారు. తాను చిన్నతనంలో అనుభవించిన పేదరికం, కష్టాలు పేద విద్యార్థులకు ఎదురుకాకూడదన్న ఉద్దేశంతోనే ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. విద్యార్థులకు డిజిటల్ విద్యను అందుబాటులోకి తీసుకురావడంతోపాటు, ఖగోళశాస్త్రంపై అవగాహన పెంచేందుకు ఆస్ట్రో ల్యాబ్‌లను సైతం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం, దాతలు కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని చదువుల్లో రాణించాలని విద్యార్థులకు సూచించారు.

**ప్రపంచస్థాయి ప్రమాణాలతో ప్రభుత్వ పాఠశాలలు**

జిల్లా విద్యాశాఖాధికారి బాలాజీరావు మాట్లాడుతూ నెల్లూరులోని ప్రభుత్వ పాఠశాలలను ప్రపంచస్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని మంత్రి నారాయణ సంకల్పించారని తెలిపారు. ఆయన ప్రత్యేక చొరవతో ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి సదుపాయాలు కల్పిస్తున్నారని, తద్వారా పేద విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారని పేర్కొన్నారు.

**వైకుంఠపురం పాఠశాల పరిశీలన**

అనంతరం మంత్రి నారాయణ వైకుంఠపురంలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. పాఠశాలలోని సదుపాయాలను సమీక్షించి, ఆధునికీకరణకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మెరుగైన వాతావరణం, నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఎంఈఓ తిరుపాల్, ప్రధానోపాధ్యాయుడు మురళీకృష్ణ, జిగ్మా కంపెనీ ప్రతినిధి శంకర్ నారాయణ, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్, కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ లక్ష్మి, మాజీ జెడ్పీటీసీ విజేతారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# జనసేన సంస్థాగత బలోపేతమే లక్ష్యం!

- తిరుపతి పార్లమెంట్ సమన్వయకర్తగా బాధ్యతలు.. పవన్ కళ్యాణ్‌కు మిద్దెల హరి కృతజ్ఞతలు
- ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా.. పార్టీ నాయకులు, జనసైనికులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతా: మిద్దెల హరి

**శ్రీకాళహస్తి ,పెన్ పవర్ ,అక్టోబర్ 09:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని జనసేన పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయడం, క్షేత్రస్థాయిలో పార్టీ నాయకులు, జనసైనికుల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం లక్ష్యంగా పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రత్యేక అడహాక్ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో తిరుపతి పార్లమెంట్ సమన్వయకర్తగా తనకు కీలక బాధ్యతలు అప్పగించడంపై జనసేన నాయకుడు మిద్దెల హరి హర్షం వ్యక్తం చేస్తూ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

తనపై నమ్మకంతో తిరుపతి పార్లమెంట్ సమన్వయకర్తగా బాధ్యతలు అప్పగించిన పవన్ కళ్యాణ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు మిద్దెల హరి పేర్కొన్నారు. పార్టీ అప్పగించిన ఈ



బాధ్యతను ఒక పదవిగా కాకుండా, ప్రజలకు మరింత చేరువగా ఉండి వారి సమస్యలను తెలుసుకునేందుకు లభించిన అవకాశంగా భావిస్తున్నట్లు తెలిపారు.

**ప్రజా సమస్యలే ప్రాధాన్యం.. పార్టీ బలోపేతమే లక్ష్యం!**

జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేస్తూ ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని మిద్దెల హరి స్పష్టం చేశారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత నాయకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు.

పార్టీ నాయకులు, జనసైనికులతో సమన్వయం చేసుకుంటూ సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్టం చేయడంపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. గ్రామస్థాయి నుంచి పార్లమెంట్ స్థాయి వరకు పార్టీ శ్రేణుల మధ్య సమన్వయం, ఐక్యత, నిరంతర ప్రజాసంబంధాలు పార్టీ అభివృద్ధికి కీలకమని పేర్కొన్నారు. ప్రతి నాయకుడు, ప్రతి జనసైనికుడు ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసినప్పుడే పార్టీ లక్ష్యాలను మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లగలమని అభిప్రాయపడ్డారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సమన్వయంతో సన్నద్ధం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణులను సమన్వయం చేయడం, క్షేత్రస్థాయిలో జనసేన పార్టీని బలోపేతం చేయడం, ప్రజల్లో పార్టీ పట్ల అవగాహన పెంపొందించడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తానని మిద్దెల హరి తెలిపారు. పార్టీ అధినేత తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, అప్పగించిన బాధ్యతలను అంకితభావంతో నిర్వర్తిస్తానని పేర్కొన్నారు.

ప్రజాసేవే ధ్యేయంగా, పార్టీ సిద్ధాంతాలే మార్గదర్శకంగా ముందుకు సాగుతూ తిరుపతి పార్లమెంట్ పరిధిలో జనసేన పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని మిద్దెల హరి ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## పెన్ పవర్ రాయలసీమ

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా । తిరుపతి । చిత్తూరు । వై.ఎస్.ఆర్. కడప

# అర్హత మాట్లాడే ముందు చరిత్ర తెలుసుకో..
# ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డికి రూప్ కుమార్ యాదవ్ కౌంటర్

- కార్పొరేషన్ రూపాయి వాడినట్లు నిరూపిస్తే ఛాలెంజ్.. సవాల్ విసిరిన రూప్ కుమార్ యాదవ్
- రిజర్వేషన్లు రాకుండానే క్యాండిడేటా? వైఎస్సార్సీపీ రాజకీయ అపరిపక్వతపై విమర్శలు..
- గతంలో వైఎస్సార్సీపీ హయాంలోనే నందన్‌కు పదవులు ఇచ్చినట్లు గుర్తుచేసిన రూప్ కుమార్
- ఎన్నికల వేళ బీసీ గర్జనలు అంటూ వైఎస్సార్సీపీ మళ్లీ నాటకాలు ఆడుతోంది: రూప్




**నెల్లూరు అక్టోబర్ 9 పెన్ పవర్ నెల్లూరు బ్యూరో**

నెల్లూరు జిల్లా టిడిపి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి వ్యాఖ్యలపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. నిన్న వైఎస్సార్సీపీ నెల్లూరు నగర ఇన్‌ఛార్జ్ చంద్రశేఖర్ రెడ్డి చేసిన విమర్శలకు రూప్ కుమార్ యాదవ్ ఘాటుగా సమాధానమిచ్చారు.కమిషనర్ నియామకం, ఆయన అర్హతలపై సుదీర్ఘ ఉపన్యాసాలు ఇచ్చిన చంద్రశేఖర్ రెడ్డికి అసలు అర్హతల గురించి మాట్లాడే హక్కు ఎక్కడిదని రూప్ కుమార్ యాదవ్ ప్రశ్నించారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలోనే ఇదే నందన్ ని నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ ఛైర్మన్‌గా నియమించింది నిజం కాదా అని నిలదీశారు. అంతేకాకుండా,అప్పటిముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి సొంత జిల్లా వైఎస్సార్ కడపకు వైస్ ఛైర్మన్‌గా కూడా రెండేళ్ల పాటు ఇదే నందన్ పనిచేశారని గుర్తుచేశారు. అప్పట్లో చంద్రశేఖర్ రెడ్డి రాజకీయాల్లో లేకపోవడం వల్లే ఈ విషయాలు తెలియలేదని, నోటికొచ్చినట్లు మాట్లాడకుండా తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు. కమిషనర్‌గా ఎవరిని నియమించాలి, ఎవరితో పనిచేయించుకోవాలనేది ప్రభుత్వ ఇష్టమని, నిబంధనలకు అనుగుణంగానే నిర్ణయాలు ఉంటాయని స్పష్టం చేశారు. ప్రతిపక్ష వైఎస్సార్సీపీ నేతలకు నచ్చినట్లు అధికారులను నియమించాలంటే ఈ ప్రభుత్వంలో కుదరదని తేల్చిచెప్పారు. గ్రూప్-1 సాధించి ఉన్నత చదువులు చదివిన ఒక అధికారిపై ఇలాంటి విమర్శలు చేయడం తగదని, కమిషనర్ గారి పనితీరును నెల్లూరు ప్రజలు చూస్తున్నారని తెలిపారు. మంత్రి నారాయణ పై ప్రతీసారీ విఆర్ హై స్కూళ్లు, బస్సులు, చెట్లు, కాంపాక్టర్లు, స్వీపింగ్ మెషిన్లు అంటూ ఒకే రకమైన పాత విమర్శలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఈ ఉదయం కూడా బాలాజీ నగర్‌లోని ఎంఎస్ఎం హైస్కూల్ అభివృద్ధికి 10 కోట్ల అంచనాతో నారాయణ గారు శంకుస్థాపన చేశారని వివరించారు. నెల్లూరు నగరంలోని ప్రతీ ప్రభుత్వ హైస్కూల్‌ను దాదాపు 10 కోట్లకు పైగా అంచనాతో, తమకున్న విస్తృత పరిచయాలు, సంబంధాలతో నారాయణ అభివృద్ధి చేస్తున్నారని వెల్లడించారు..కార్పొరేషన్ డబ్బుల నుంచి ఒక్క రూపాయి కూడా విఆర్ హై స్కూల్‌కే కాకుండా ఏ ప్రభుత్వ స్కూల్‌కూ ఖర్చు పెట్టలేదని స్పష్టం చేశారు.బస్సుల రవాణాకు లేదా అద్దెలకు కార్పొరేషన్ నిధుల నుంచి లక్ష డ్రా చేసినట్లు నిరూపిస్తే ఏం చెప్పినా చేస్తామని సవాల్ విసిరారు. విఆర్ హై స్కూల్ నిర్వహణ కోసం ప్రతీ నెల నారాయణ తమ సొంత డబ్బులు లక్షలకు పైగా ఖర్చు చేస్తున్నారని తెలిపారు. ప్రజల కోసం మీ జీవితంలో ఎప్పుడైనా 20 వేలు అయినా ఖర్చు పెట్టారా అని చంద్రశేఖర్ రెడ్డి ప్రశ్నించారు. అక్రమంగా డబ్బులు సంపాదించాల్సిన కర్మ నారాయణ కుటుంబానికి లేదని, సొంత కష్టార్జితాన్ని ప్రజల సంక్షేమానికి ఖర్చు చేస్తున్నారని కొనియాడారు. కళ్లకు గంతలు కట్టుకోకుండా అభివృద్ధిని చూడాలని, టీవీల్లో పాత టేపులు ప్లే చేయడం కాదని ఎద్దేవా చేశారు.స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లు ఇంకా ఖరారు కాకుండానే వైఎస్సార్సీపీ అభ్యర్థిని ప్రకటించడం వారి రాజకీయ అపరిపక్వతకు నిదర్శనమని మండిపడ్డారు.తమ 30 ఏళ్ల రాజకీయ జీవితంలో రిజర్వేషన్ రాకముందే అభ్యర్థిని ప్రకటించడం ఎప్పుడూ చూడలేదన్నారు. ఓసీ అభ్యర్థి అని విజయ్ కుమార్ రెడ్డి పేరు చెప్పిన వైఎస్సార్సీపీ నేతలు, బీసీ లేదా ఎస్సీ అభ్యర్థుల పేర్లను ఎందుకు ప్రకటించలేదని సూటిగా ప్రశ్నించారు. ఇది బీసీ, ఎస్సీ వర్గాల పట్ల వైఎస్సార్సీపీకి ఉన్న చిన్నచూపేనని విమర్శించారు. ఎన్నికలు వస్తున్నాయనే మళ్లీ బీసీలను మోసం చేయడానికి బీసీ గర్జనలు పేరిట నాటకాలాడుతున్నారని ఆరోపించారు.రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, నారా లోకేష్ నిరంతరం శ్రమిస్తూ లక్షల కోట్ల పెట్టుబడులు తెస్తున్నారని, ప్రజలంతా కూటమి ప్రభుత్వం వైపే ఉన్నారని చెప్పారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలే వైఎస్సార్సీపీకి తగిన గుణపాఠం చెప్పి, కూటమి ప్రభుత్వానికి మరియు నారాయణ కి మద్దతుగా స్పష్టమైన తీర్పు ఇస్తారని రూప్ కుమార్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు మామిడాల మధు , కార్పొరేటర్ కర్తం ప్రతాప్ రెడ్డి, నాయకులు జహీర్, తిరుమల నాయుడు, మైనుద్దీన్, కువ్వరపు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# రైతన్నలకు భూభద్రతే కూటమి ప్రభుత్వ లక్ష్యం!





- ఇసుకతాగేలిలో 300 మంది రైతులకు రాజముద్ర పాస్‌పుస్తకాల పంపిణీ
- రైతుల భూ సమస్యల పరిష్కారానికి అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు

**ఏర్పేడు, పెన్ పవర్, అక్టోబర్ 09:**

శ్రీకాళహస్తి నియోజకవర్గం, ఏర్పేడు మండలం, ఇసుకతాగేలి గ్రామంలో రీ-సర్వే ప్రాజెక్టు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రీ-సర్వే ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసుకున్న 300 మంది రైతులకు అధికారిక రాజముద్ర పాస్‌పుస్తకాలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా రైతులకు పాస్‌పుస్తకాలను అందజేస్తూ, భూమిపై స్పష్టమైన యాజమాన్య హక్కులు కల్పించడం, భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రైతులు తమ భూములకు సంబంధించిన హక్కుల విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా భూభద్రత కల్పించేందుకు రీ-సర్వే ప్రక్రియ ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు.

అనంతరం గ్రామస్తులు, రైతులతో ఆత్మీయంగా ముఖాముఖి నిర్వహించి, వారి భూ సంబంధిత సమస్యలతో పాటు గ్రామంలో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన ప్రతి సమస్యపై సానుకూలంగా స్పందిస్తూ, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో ఎలాంటి జాప్యం జరగకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.

**రైతన్నల సంక్షేమమే ధ్యేయం.. భూమిపై హక్కులే భరోసా!**

కష్టపడి వ్యవసాయం చేస్తూ దేశానికి అన్నం పెట్టే రైతన్నలకు భూమిపై శాశ్వత భద్రత కల్పించడం, సంపూర్ణ యాజమాన్య హక్కులను నిర్ధారించడం, భవిష్యత్తులో భూ సంబంధిత వివాదాలు తలెత్తకుండా చూడటం కూటమి ప్రభుత్వ ప్రధాన ఆశయమని పేర్కొన్నారు. రైతుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

రీ-సర్వే ద్వారా భూముల వివరాల్లో పారదర్శకత పెరగడంతో పాటు రైతులకు తమ భూములపై స్పష్టమైన హక్కులు లభిస్తాయని, తద్వారా వారు ఆర్థికంగా, సామాజికంగా మరింత భరోసాతో ముందుకు సాగేందుకు అవకాశం కలుగుతుందని ఈ సందర్భంగా వివరించారు.

# కొప్పల శంకరయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన తల్లెం భరత్ కుమార్ రెడ్డి

**ఎన్ పవర్, అక్టోబర్ 09:**

తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గ పట్టణ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ రైల్వే కోడూరు మండల ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు కొప్పల శంకరయ్య జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాయలసీమ జోన్ బూత్ కమిటీ అధ్యక్షుడు తల్లెం భరత్ కుమార్ రెడ్డి కేక్ కట్ చేసి శంకరయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నూక మహేశ్వర్ రెడ్డి, మాజీ ట్రేడ్ యూనియన్ నాయకుడు కౌలూరి సుబ్రహ్మణ్యం రెడ్డి, మాజీ సర్పంచ్ బైశంకర్ రెడ్డి, శ్రీరాములు, మస్తాన్, శీను, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొని శంకరయ్యకు శుభాకాంక్షలు తెలియజేశారు.



# చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు.. చెడు స్నేహాలకు దూరంగా ఉండాలి!









**- విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.బి. వాణిశ్రీ హితవు**
**- ఎస్వీఏ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు**

**శ్రీకాళహస్తి, పెన్ పవర్, అక్టోబర్ 09:**
విద్యార్థులు విలువైన సమయాన్ని వృథా చేయకుండా, చెడు స్నేహాలకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో చదువుకోవాలని ఎస్వీఏ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.బి. వాణిశ్రీ సూచించారు. విద్యార్థి దశ జీవితంలో అత్యంత కీలకమైనదని, ఈ సమయంలో నేర్చుకున్న విజ్ఞానం, అలవర్చుకున్న క్రమశిక్షణ భవిష్యత్తుకు బలమైన పునాదులుగా నిలుస్తాయని ఆమె పేర్కొన్నారు.
శుక్రవారం శ్రీకాళహస్తిలోని ఎస్వీఏ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో సందడి నెలకొనగా, నూతన విద్యార్థులు ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొన్నారు.

**ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి.. స్నేహభావంతో మెలగాలి**
ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.బి. వాణిశ్రీ మాట్లాడుతూ, సీనియర్ విద్యార్థులు జూనియర్లను ర్యాగింగ్‌కు గురిచేయకుండా, వారితో స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. కళాశాల నియమ నిబంధనలు, విద్యా విధానాలు, విద్యార్థుల బాధ్యతలపై నూతన విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు.
ఫ్రెషర్స్ డే వంటి కార్యక్రమాలు సీనియర్, జూనియర్ విద్యార్థుల మధ్య సత్సంబంధాలను పెంపొందించడంతో పాటు పరస్పర గౌరవం, సహకార భావనను బలోపేతం చేస్తాయని చెప్పారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా సీనియర్ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాభావం పెరుగుతాయని పేర్కొన్నారు. విద్యార్థులు విద్యతో పాటు నైతిక విలువలు, మానవీయ గుణాలు అలవర్చుకొని సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు.

**తల్లిదండ్రుల కష్టాలను గుర్తించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి**
ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరైన ప్రముఖ మిమిక్రీ కళాకారుడు, వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ డి. విజయ్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థులు తమ తల్లిదండ్రులు పడుతున్న కష్టాలను గుర్తించి, వారి ఆశయాలను నెరవేర్చేలా కష్టపడి చదువుకోవాలని పిలుపునిచ్చారు. క్రమశిక్షణ, పట్టుదల, సమయపాలన, ఆత్మవిశ్వాసం విజయానికి కీలకమని వివరించారు.
విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధనకు నిరంతరం కృషి చేయాలని, తమ ప్రతిభతో తల్లిదండ్రులకు, సొంత ఊరికి, కళాశాలకు, దేశానికి మంచి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని సూచించారు. జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటూ సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని హితవు పలికారు.
అనంతరం డాక్టర్ విజయ్ కుమార్ తనదైన శైలిలో మిమిక్రీ, మ్యాజిక్ ప్రదర్శనలు నిర్వహించి విద్యార్థులను విశేషంగా అలరించారు. ఆయన ప్రదర్శనలతో విద్యార్థులు ఉత్సాహంగా సందడి చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు విశిష్ట అతిథి డాక్టర్ విజయ్ కుమార్‌ను శాలువా, పుష్పగుచ్ఛంతో ఘనంగా సన్మానించారు.

**ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు**
సభానంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నృత్యాలు, ఇతర కళా ప్రదర్శనలతో విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. నూతన విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు, కళాశాల జీవితంపై సానుకూల దృక్పథాన్ని కల్పించేలా ఫ్రెషర్స్ డే వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి.
ఈ కార్యక్రమంలో డాక్టర్ గంగారాం, డాక్టర్ బాపనయ్య, డాక్టర్ కందేరి శ్రీదేవి, డాక్టర్ పి. వేణుగోపాల్, టి. నరసింహులు, డాక్టర్ వి. వాసవి, డాక్టర్ భాస్కర్, డాక్టర్ పి. గాయత్రి, డాక్టర్ రమేష్ బాబు, డాక్టర్ సాయి వెంకటేష్, డాక్టర్ కె. సుబ్బారావు, ఎస్. పద్మావతి, డాక్టర్ తులసి తదితర అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# వార్డుల పునర్విభజనలో అక్రమాలకు తావిస్తే సహించేది లేదు!





**- మున్సిపల్ ఎన్నికలు పారదర్శకంగా, న్యాయబద్ధంగా నిర్వహించాలి**
**- వైఎస్సార్సీపీ సీనియర్ నేత అంజూరు తారక శ్రీనివాసులు డిమాండ్**

**శ్రీకాళహస్తి, పెన్ పవర్, అక్టోబర్ 09:**
శ్రీకాళహస్తి మున్సిపాలిటీలో వార్డుల పునర్విభజన ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని వైఎస్సార్సీపీ సీనియర్ నాయకులు, శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మున్సిపల్ వార్డుల విభజనలో రాజకీయ జోక్యానికి తావివ్వకుండా, ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని నిర్ణయాలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన రెడ్డి సూచనల మేరకు శుక్రవారం వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ కె.వి. కృష్ణారెడ్డిని ఆయన కార్యాలయంలో కలిశారు. వార్డుల పునర్విభజన ప్రక్రియలో ప్రజలకు ఎలాంటి అన్యాయం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

**35 వార్డుల నుంచి 44 వార్డులకు పునర్విభజన**
**ఈ సందర్భంగా అంజూరు తారక శ్రీనివాసులు మీడియాతో మాట్లాడుతూ..**
శ్రీకాళహస్తి మున్సిపాలిటీలో ప్రస్తుతం ఉన్న 35 వార్డులను 44 వార్డులుగా పునర్విభజించేందుకు కమిషనర్ నోటిఫికేషన్ విడుదల చేశారని తెలిపారు. ఈ ప్రక్రియపై అభ్యంతరాలు ఉంటే అక్టోబర్ 14వ తేదీలోపు తెలియజేయాలని అధికారులు సూచించినట్లు పేర్కొన్నారు.
వార్డుల పునర్విభజన అనేది కేవలం పరిపాలనాపరమైన ప్రక్రియ మాత్రమే కాదని, భవిష్యత్తులో ప్రజాప్రతినిధుల ఎన్నికలు, స్థానిక ప్రజల ప్రాతినిధ్యం, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రభావం చూపే కీలక అంశమని ఆయన అభిప్రాయపడ్డారు. అందువల్ల ఈ ప్రక్రియను హడావుడిగా కాకుండా, అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనల ప్రకారం చేపట్టాలని కోరారు.

**జనాభా ప్రాతిపదికన వార్డుల విభజన జరగాలి**
ప్రతి వార్డులో సుమారు 1,450 నుంచి 1,650 ఓట్లు ఉండేలా జనాభా ప్రాతిపదికన వార్డులను విభజించాలని అంజూరు తారక శ్రీనివాసులు సూచించారు. భౌగోళిక సరిహద్దులు, ప్రాంతాల అనుసంధానం, బ్లాక్‌ల వారీగా ఉన్న నివాస ప్రాంతాలను పరిగణనలోకి తీసుకొని శాస్త్రీయ పద్ధతిలో వార్డుల పునర్విభజన చేపడితే ఎవరికీ అభ్యంతరాలు ఉండవని పేర్కొన్నారు.
అన్ని ప్రాంతాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించేలా వార్డుల సరిహద్దులు నిర్ణయించాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం పెరగాలంటే వార్డుల విభజన నుంచే పారదర్శకతకు పెద్దపీట వేయాల్సిన అవసరం ఉందన్నారు.

**రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గితే పోరాటం తప్పదు!**
అధికార పార్టీ రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా వార్డుల పునర్విభజన చేపట్టి, వైఎస్సార్సీపీకి బలమున్న ప్రాంతాలను ఉద్దేశపూర్వకంగా విడగొట్టే ప్రయత్నాలు జరిగితే సహించేది లేదని అంజూరు తారక శ్రీనివాసులు హెచ్చరించారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల ఓటర్లు ఒకే ప్రాంతంలో కాకుండా వేర్వేరు వార్డుల్లోకి వెళ్లేలా గందరగోళంగా సరిహద్దులు నిర్ణయించకూడదని అన్నారు.
వార్డుల పునర్విభజనలో ఏ ఒక్క రాజకీయ పార్టీకి అనుకూలంగా లేదా ప్రతికూలంగా నిర్ణయాలు తీసుకోకుండా, ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ప్రజల అభిప్రాయాలను, అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకొని న్యాయబద్ధమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు.
అధికారులు విడుదల చేసే వార్డుల తుది జాబితాను సమగ్రంగా పరిశీలించిన అనంతరం తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వార్డుల విభజన జరిగినట్లు గుర్తిస్తే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున ప్రజాస్వామ్యబద్ధంగా, పూర్తిస్థాయిలో పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు ఆర్కాట ముత్తు, మహబూబ్ బాషా, ఉత్తరాది శరవణ కుమార్, కంట ఉదయ్ కుమార్, పసల సుమతితో పాటు వైఎస్సార్సీపీ నాయకులు శ్రీవారి సురేష్, పటాన్ ఫరీద్, గోర, రామచంద్రారెడ్డి, మైనంపాటి మస్తాన్, సాధనమున్న రాయల్, ఆర్కాట్ శంకర్, బాల్ శెట్టి చంద్రశేఖర్, గఫూర్, లీల, ముని కృష్ణారెడ్డి, ఫజల్, వేలూరు రమేష్, షేక్ అస్లాం, ఆశా కిరణ్, ఆరిఫ్, గుణ, ప్రకాష్, పుట్టు హరినాథ్, జూమ్లేష, సాదిక్, గాదిపాకుల కిరణ్, కన్నా, సునీల్, మణికంఠ, బాబాజీ, బషీర్, జిలాని, సాగర్ బి, షర్మిల ఠాకూర్, జీవన్ తదితర నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రమాదంలో గాయపడిన టీడీపీ సీనియర్ నాయకుడు నాగేశ్వరరావుకు పరామర్శ

**- ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న డాక్టర్ రెడ్డివారి గురువారెడ్డి**

**ఏర్పేడు,పెన్ పవర్,అక్టోబర్ 09:**
ఏర్పేడు మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు డి. నాగేశ్వరరావు ఇటీవల మోటార్ సైకిల్ ప్రమాదంలో గాయపడి, వైద్యం అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న నేపథ్యంలో శుక్రవారం ఆయనను పలువురు టీడీపీ నాయకులు పరామర్శించారు.
ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, నెల్లూరు అర్బన్ నియోజకవర్గ పార్టీ పరిశీలకులు డాక్టర్ రెడ్డివారి గురువారెడ్డి నాగేశ్వరరావు నివాసానికి



వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును, ప్రస్తుతం అందుతున్న వైద్య చికిత్స వివరాలను తెలుసుకుని, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.
పార్టీ కోసం సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్న సీనియర్ నాయకుడు నాగేశ్వరరావు త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని తిరిగి సాధారణ జీవితాన్ని కొనసాగించాలని నాయకులు ఆకాంక్షించారు. కష్టసమయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఒకరికొకరు అండగా నిలవడం తెలుగుదేశం పార్టీ కుటుంబ ఐక్యతకు నిదర్శనమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.
ఈ పరామర్శ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు డాక్టర్ నైనారు పున్నారావు, మండల పార్టీ కార్యదర్శి కె.వి. రమణ తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రతిరోజూ ఒక గుడ్డు.. సంపూర్ణ ఆరోగ్యానికి తొలిమెట్టు!








**- ప్రపంచ గుడ్డు దినోత్సవం సందర్భంగా ప్రగతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు**

**శ్రీకాళహస్తి,పెన్ పవర్,అక్టోబర్ 09:**
ప్రపంచ గుడ్డు దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీకాళహస్తి రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న పాఠశాలల్లో ప్రగతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పోషకాహారంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.
ఈ కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులు, గర్భిణులు, బాలింతలకు గుడ్డులోని పోషక విలువలు, ఆరోగ్యానికి కలిగే ప్రయోజనాల గురించి వివరించారు.
**ఈ సందర్భంగా ప్రగతి స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ..**
గుడ్డు సంపూర్ణ పోషక విలువలు కలిగిన ఆహారమని, ప్రతిరోజూ ఒక గుడ్డును ఆహారంలో భాగంగా తీసుకోవడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. శరీర ఎదుగుదలకు, కండరాల అభివృద్ధికి, ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన ప్రోటీన్‌తో పాటు పలు కీలక పోషకాలు గుడ్డులో లభిస్తాయని వివరించారు.
ముఖ్యంగా యుక్తవయసులో ఉన్న పిల్లలు, కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఈ వయసులో శరీరానికి అవసరమైన పోషకాలు అందకపోతే ఎదుగుదలపై ప్రభావం పడే అవకాశం ఉందని, అందువల్ల సమతుల్య ఆహారం తీసుకోవడం ఎంతో అవసరమని పేర్కొన్నారు.
ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల ద్వారా విద్యార్థులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారంలో భాగంగా గుడ్లను అందించడం వల్ల వారి ఆరోగ్య పరిరక్షణకు దోహదపడుతుందని తెలిపారు. అధిక ఖర్చు లేకుండా సులభంగా అందుబాటులో లభించే గుడ్డు పేద, మధ్యతరగతి కుటుంబాలకు కూడా మంచి పోషకాహార వనరుగా ఉపయోగపడుతుందని చెప్పారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లోని కుటుంబాలు తమ ఇళ్ల వద్ద పెరటి కోళ్లు, గిరిరాజా కోళ్లను పెంచుకోవడం ద్వారా ఇంటి అవసరాలకు గుడ్లు పొందడంతో పాటు అదనపు ఆదాయాన్ని కూడా సమకూర్చుకోవచ్చని చంద్రశేఖర్ సూచించారు. దీనివల్ల కుటుంబాలకు పోషకాహారం అందడంతో పాటు గ్రామీణ జీవనోపాధికి కూడా తోడ్పాటు లభిస్తుందని వివరించారు.
పోషకాహార లోపాన్ని నివారించేందుకు ప్రతి కుటుంబం ఆహారపు అలవాట్లపై అవగాహన పెంచుకోవాలని, ముఖ్యంగా పిల్లలు, మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రపంచ గుడ్డు దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమాలు ప్రజల్లో పోషకాహారంపై చైతన్యం పెంపొందించేందుకుదోహదపడతాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

# శ్రీకాళహస్తి శ్రీ చైతన్యలో వైభవంగా దసరా వేడుకలు!

## నవదుర్గల వేషధారణలో విద్యార్థినుల సందడి.. భక్తిశ్రద్ధలతో బొమ్మల కొలువు!




**శ్రీకాళహస్తి, పెన్ పవర్, అక్టోబర్ 09:**
పట్టణంలోని శ్రీరామ్ నగర్ కాలనీలో ఉన్న శ్రీ చైతన్య పాఠశాలలో ముందస్తు దసరా వేడుకలను శుక్రవారం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సంప్రదాయం, సంస్కృతి, ఆధ్యాత్మిక విలువలను ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన ఈ వేడుకలు విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపాయి.
ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో సంప్రదాయబద్ధంగా బొమ్మల కొలువును ఏర్పాటు చేశారు. విద్యార్థులుభక్తిపూర్వకంగాదుర్గాదేవి శ్లోకాలను ఆలపిస్తూ అమ్మవారి మహిమను స్మరించుకున్నారు. నవదుర్గల వేషధారణలో విద్యార్థులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. దుర్గాదేవి తొమ్మిది అవతారాల విశిష్టతను, ప్రతి అవతారం వెనుక ఉన్న ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను తోటి విద్యార్థులకు వివరించి, పండుగ గొప్పతనాన్ని తెలియజేశారు.
ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ ఎ. రూపాదేవి మాట్లాడుతూ.. దసరా పండుగ కేవలం ఒక వేడుక మాత్రమే కాదని, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమలోని కోపం, అహంకారం, అసూయ, ద్వేషం వంటి ప్రతికూల భావాలను జయించి, మంచితనం, క్రమశిక్షణ, ప్రేమ, సోదరభావం వంటి సద్గుణాలను అలవరచుకోవాలనివిద్యార్థులకు సూచించారు.
పండుగల ద్వారా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, నైతిక విలువలను చిన్ననాటి నుంచే తెలుసుకోవడం ఎంతో ముఖ్యమని వివరించారు.
ఏజీఎం సురేష్ మాట్లాడుతూ.. నిజమైన విజయం ఇతరులను ఓడించడంలో లేదని, మనలోని బలహీనతలను అధిగమించి, మంచి వ్యక్తులుగా ఎదగడంలోనే ఉందని పేర్కొన్నారు.
విద్యార్థులు చదువుతో పాటు నైతిక విలువలు, ఆధ్యాత్మిక భావనలు, సంస్కృతి సంప్రదాయాల పట్ల గౌరవాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకతను, ఆత్మవిశ్వాసాన్ని, మన సంస్కృతిపై అవగాహనను పెంపొందిస్తాయని తెలిపారు.
నవదుర్గల వేషధారణలు, బొమ్మల కొలువు, భక్తి శ్లోకాలతో పాఠశాల ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. విద్యార్థులుఉత్సాహంగాపాల్గొనడంతో దసరా వేడుకలు ఆనందోత్సాహాల మధ్య విజయవంతంగా ముగిశాయి.
ఈ కార్యక్రమంలో జోనల్ కోఆర్డినేటర్లు లావణ్య, అమ్మాజీ, ఇన్‌చార్జులు కల్పన, వాసంతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ది స్కూల్‌లో వైభవంగా దసరా బొమ్మల కొలువు!

## సంప్రదాయాలు, సాంస్కృతిక విలువలను చాటిన చిన్నారుల వేడుకలు

**శ్రీకాళహస్తి, పెన్ పవర్ ,అక్టోబర్ 09:**
పట్టణంలోని ది స్కూల్‌లో కిండర్‌గార్టెన్ విద్యార్థులచే శుక్రవారం ముందస్తు దసరా సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన దసరా బొమ్మల కొలువు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని పండుగ వాతావరణాన్ని సందడిగా మార్చారు.
ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జనార్ధన్ రావు జె. పవార్ మాట్లాడుతూ, దసరా పండుగ విశిష్టతను, బొమ్మల కొలువు వెనుక ఉన్న సంప్రదాయాలను చిన్నారులకు వివరించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాల పట్ల




చిన్నతనం నుంచే పిల్లలకు అవగాహన కల్పించడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. పాఠ్యాంశాలతో పాటు మన సంస్కృతీ సంప్రదాయాలను కూడా విద్యార్థులకు పరిచయం చేయడం ద్వారా వారిలో నైతిక విలువలు, సాంస్కృతిక చైతన్యం పెంపొందుతాయని తెలిపారు.
విద్యార్థులు ఇటువంటి పండుగ వేడుకల్లో పాల్గొనడం వల్ల మన సంప్రదాయాల పట్ల ఆసక్తి, పెద్దల పట్ల గౌరవం, ఐకమత్య భావన పెరుగుతాయని పేర్కొన్నారు. పాఠశాల స్థాయిలో నిర్వహించే ఇటువంటి కార్యక్రమాలు చిన్నారుల్లో సృజనాత్మకతను, భారతీయసంస్కృతిపైఅవగాహనను పెంపొందించేందుకు దోహదపడతాయని తెలిపారు.
ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు పి. విశాల, ఉపాధ్యాయ బృందం పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలకు లైన్ క్లియర్

**- సర్ ప్రక్రియ పూర్తయిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలన్న వైసీపీ పిటిషన్ కొట్టివేసిన సుప్రీంకోర్టు**
**- హైకోర్టు గైడెన్స్ ప్రకారం ఆరు వారాల్లోపు ఎన్నికలకు నోటిఫికేషన్ ఇచ్చేందుకు సిద్ధమన్న ఏపీ ఎన్నికల కమిషన్**
**- నోటిఫికేషన్ లోపు సర్ ప్రక్రియ పూర్తి అయితే నూతన సర్ ప్రక్రియ ప్రకారం జాబితా లేదంటే పాత జాబితా ప్రకారం ఎన్నికలు**

**నెల్లూరు అక్టోబర్ 9 పెన్ పవర్ స్టేట్ బ్యూరో**
ఏపీలో స్థానిక ఎన్నికల నిర్వహణకు అత్యున్నత న్యాయస్థానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 'సర్' ప్రక్రియ పూర్తయిన తరువాతే స్థానిక ఎన్నికలు జరపాలంటూ వైకాపా (YSRCP) దాఖలు చేసిన పిటిషన్ పై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. ఆ పార్టీ లేవనెత్తిన ఏ విషయాన్నీ అత్యున్నత న్యాయస్థానం పరిగణనలోకి తీసుకోలేదు.
హైకోర్టు ఇచ్చిన సమయం ప్రకారం ఆరు వారాల్లోపు నోటిఫికేషన్ కు సిద్ధమని రాష్ట్ర ఎన్నికల సంఘం సుప్రీంకోర్టుకు తెలిపింది. నోటిఫికేషన్ విడుదలయ్యేలోపు 'సర్' పూర్తయితే ఆ జాబితా తీసుకోవాలని.. లేకపోతే పాత జాబితా ప్రకారమే ఎన్నికలు నిర్వహించుకోవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ విషయంలో ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని



ధర్మాసనం సమర్థించింది. ఎన్నికలకు ఆటంకం కలిగించడమంటే ప్రజా ప్రయోజనాలను అడ్డుకోవడమేనని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

# అబాకస్‌లో శ్రీ చైతన్య విద్యార్థుల విజయదుందుభి!

- అంతర్జాతీయ పోటీల్లో ఐదుగురికి 'ఛాంపియన్ ఆఫ్ ది ఛాంపియన్స్' అవార్డులు
- ప్రతిభకు పట్టుదల తోడైతే విజయాలు సొంతం.. విద్యార్థులను అభినందించిన పాఠశాల యాజమాన్యం

శ్రీకాళహస్తి,పెన్ పవర్,అక్టోబర్ 09:
విద్యతో పాటు మేధో వికాసంలోనూ తమదైన ముద్ర వేస్తూ శ్రీకాళహస్తి పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటారు. అబాకస్ గణితంలో అసాధారణ ప్రతిభ కనబరిచి ఏకంగా ఐదుగురు విద్యార్థులు ప్రతిష్ఠాత్మకమైన 'ఛాంపియన్ ఆఫ్ ది ఛాంపియన్స్' అవార్డులను కైవసం చేసుకుని పాఠశాలకు, పట్టణానికి గర్వకారణంగా నిలిచారు.

పట్టణంలోని శ్రీరామ్ నగర్ కాలనీలో ఉన్న శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు అబాకస్ అండ్ మెంటల్ అరిథ్మెటిక్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చెన్నైలో ఈనెల 26న నిర్వహించిన ఇంటర్నేషనల్ డైరెక్ట్ ఓపెన్ టు ఆల్ అబాకస్ కాంపిటీషన్లో అద్భుత ప్రతిభ కనబరిచారు. వేగంగా గణనలు చేయడం, ఏకాగ్రతతో సమస్యలను పరిష్కరించడం, మానసిక గణిత నైపుణ్యాలను ప్రదర్శించడం ద్వారా పోటీల్లో ప్రత్యేక గుర్తింపు సాధించారు.

ఐదుగురు విద్యార్థులకు ప్రతిష్ఠాత్మక అవార్డులు

ఈ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థుల వివరాలు ఇలా ఉన్నాయి.

1. ఎం. స్వప్నిల్ 9వ తరగతి (సి2): అబాకస్‌లోని మొత్తం ఎనిమిది స్థాయిలను విజయవంతంగా పూర్తి



చేసి 'ఛాంపియన్ ఆఫ్ ది ఛాంపియన్స్' అవార్డును అందుకున్నాడు. ఎనిమిది స్థాయిలను పూర్తి చేయడం అతని నిరంతర సాధనకు, అంకితభావానికి నిదర్శనంగా నిలిచింది.
2. ఎస్. యశ్వంత్ 9వ తరగతి (ఎల్2): మూడో స్థాయిని విజయవంతంగా పూర్తి చేసి ప్రతిష్ఠాత్మక అవార్డును సొంతం చేసుకున్నాడు.
3. కె. జోషిత్ 6వ తరగతి (ఎల్5): మొదటి స్థాయిని పూర్తి చేసి 'ఛాంపియన్ ఆఫ్ ది ఛాంపియన్స్' అవార్డును సాధించాడు.
4. ఎం. షణ్ముఖ ప్రియ 4వ తరగతి: మొదటి స్థాయిని విజయవంతంగా పూర్తి చేసి తన ప్రతిభను చాటుకుంది.
5. జి. నితిన్ 4వ తరగతి: రెండో స్థాయిని పూర్తి చేసి ప్రతిష్ఠాత్మక అవార్డును కైవసం చేసుకున్నాడు.

నిరంతర సాధనతోనే అసాధారణ విజయాలు: ప్రిన్సిపల్ రూపాదేవి

విద్యార్థుల విజయంపై పాఠశాల ప్రిన్సిపల్ ఎ. **రూపాదేవి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,**
"విజయం అనేది ఒక్కరోజులో వచ్చేది కాదు. నిరంతర సాధన, ఏకాగ్రత, పట్టుదల, ఆత్మవిశ్వాసం కలిసినప్పుడేఅసాధారణ విజయాలు సాధ్యమవుతాయి. మన విద్యార్థులు అంతర్జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి అవార్డులు సాధించడం ఎంతో గర్వకారణం. ఈ విజయాలు ఇతర విద్యార్థులకు కూడా స్ఫూర్తినిస్తాయి. భవిష్యత్తులోనూ విద్యార్థులు మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలి" అని ఆకాంక్షించారు.

ఏ.జి.ఎం. సురేష్ విజేతలను ప్రత్యేకంగా అభినందిస్తూ, విద్యార్థులు ఇదే స్ఫూర్తితో ముందుకు సాగి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో స్టేట్ కోఆర్డినేటర్ బాలాజీ, జోనల్ కోఆర్డినేటర్లు శ్రీనివాసులు, లావణ్య, డీన్ త్రివేణి, ఇన్‌చార్జులు కల్పన, శ్రీహరి తదితరులు పాల్గొని విజేతలను అభినందించారు.

**శ్రీకాళహస్తికి గర్వకారణంగా ఐదుగురు విజేతలు!**

అంతర్జాతీయ వేదికపై ఐదుగురు విద్యార్థులు ఒకేసారి ప్రతిష్ఠాత్మక అవార్డులు సాధించడం పాఠశాల విద్యా ప్రమాణాలకు, విద్యార్థుల కృషికి ప్రతీకగా నిలిచింది. చిన్న వయసులోనే గణిత నైపుణ్యాలను పెంపొందించుకుంటూ విద్యార్థులు సాధించిన ఈ విజయం అభినందనీయమని పలువురు హర్షం వ్యక్తం చేశారు.

# నూతన డీఎస్పీ బి. పావనికి బీజేపీ శ్రేణుల ఘన సత్కారం!

**- శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖకు సంపూర్ణ సహకారం అందిస్తాం**
**- కోలా ఆనంద్ సూచనల మేరకు డీఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన బీజేపీ నాయకులు**

**శ్రీకాళహస్తి,పెన్ పవర్ ,అక్టోబర్ 09:**
శ్రీకాళహస్తి నూతన డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన శ్రీమతి బి. పావనిని భారతీయ జనతా పార్టీ నాయకులు ఘనంగా సత్కరించి, అభినందనలు తెలిపారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ సూచనల మేరకు శ్రీకాళహస్తి నియోజకవర్గ బీజేపీ నాయకులు డీఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ బి. పావనికి కళంకారి పట్టు వస్త్రం, శ్రీకాళహస్తి దేవస్థానం శేషవస్త్రం, తీర్థప్రసాదాలను అందజేసి ఘనంగా సత్కరించారు. నూతన బాధ్యతల్లో ఆమె విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

ప్రజలకు భద్రత.. సమాజానికి రక్షణ.. పోలీస్ శాఖకు సహకారం!

ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో పోలీస్ శాఖ కీలక పాత్ర పోషిస్తుందని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడంతో పాటు, చట్టాన్ని



గౌరవించే సమాజ నిర్మాణానికి పోలీసుల కృషి ఎంతో అవసరమని తెలిపారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజా సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ చేపట్టే చట్టబద్ధమైన కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందిస్తామని బీజేపీ శ్రేణులు స్పష్టం చేశాయి.

ప్రజల విశ్వాసమే పోలీసులకు బలం.. ప్రజల సహకారమే శాంతిభద్రతలకు పునాది అని పేర్కొంటూ, పోలీస్ శాఖతో సమన్వయంతో పనిచేస్తామని నాయకులు తెలిపారు. ప్రజలకు భద్రతాభావం కల్పిస్తూ, నేరరహిత సమాజ నిర్మాణానికి నూతన డీఎస్పీ నాయకత్వంలో మరింత మెరుగైన సేవలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు, అసెంబ్లీ



కో-కన్వీనర్ మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, పట్టణ అధ్యక్షులు రాఘవనాయుడుకుప్పం హరీష్ రెడ్డి, రూరల్ మండల అధ్యక్షులు బాగిత్తి వెంకటేష్, తొట్టంబేడు మండల అధ్యక్షులు వేదం కృష్ణయ్య, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు కునాటి నాగరాజు, మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జీవీ అమర్నాథ్, సీనియర్ నాయకులు ఈరబోయిన లోకేష్, పట్టణ ప్రధాన కార్యదర్శులు కోనేటి అయ్యప్ప, కటికం చంద్రశేఖర్, పుణ్యం ఢిల్లీ కుమార్ రెడ్డి, పట్టణ యువమోర్చా అధ్యక్షులు భరత్ కుమార్ నాయుడు, ఎస్సీ మోర్చా అధ్యక్షులు గదిపాకుల యతీష్, ఓబీసీ మోర్చా అధ్యక్షులు ఫ్లెక్సీ కృష్ణారెడ్డి, కనపర్తి రవి తేజ, ఉపాధ్యక్షులు హుకీమ్ సింగ్, సింగమాల కుమార్, హరి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ తీసుకున్న వ్యూహాత్మక నిర్ణయం వల్లే రాష్ట్రంలో సుస్థిరమైన కూటమి ప్రభుత్వం ఏర్పడి అభివృద్ధికి బాటలు పడ్డాయి...



**21(పాత 16)వ డివిజన్ సంక్షేమం వెలుగులు అభివృద్ధి అడుగులు లో... కిషోర్ గునుకుల, జనసేన**

**నెల్లూరు అక్టోబర్ 9 పెన్ పవర్ నెల్లూరు బ్యూరో**
"అభివృద్ధి అంటే మాటలు కాదుడ ప్రజల జీవితాల్లో కనిపించే మార్పు. కూటమి ప్రభుత్వం ఆ మార్పును ఆచరణలో చూపిస్తోంది. నెల్లూరు నగరాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజలంతా కూటమికి అండగా నిలవాలి."

కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ జనసేన నాయకులు కిషోర్ గునుకుల, వీర మహిళ విజయలక్ష్మి గునుకుల ఆధ్వర్యంలో గత కొన్ని రోజులుగా 21వ డివిజన్ (పాత 16వ డివిజన్) పరిధిలో విస్తృత ప్రజా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఈరోజు లక్ష్మీనగర్ ఎక్స్‌టెన్షన్ ప్రాంతంలో ప్రతి గడపను ఆప్యాయంగా



పలకరిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని వివరించారు.

"సమస్యలేని ప్రభుత్వండ బలమైన మౌలిక వసతులుడ ప్రజలకు అందుబాటులో పాలన" అనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని, రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించి నెల్లూరు నగర అభివృద్ధికి మరింత బలమైన పునాది వేయాలని వారు ప్రజలను కోరారు.

ఈ సందర్భంగా పలువురు కుటుంబాలు స్వచ్ఛందంగా కూటమికి మద్దతు ప్రకటించారు. "రాష్ట్రాన్ని క్లిష్ట పరిస్థితుల నుంచి బయటకు తీసుకువచ్చి అభివృద్ధి దిశగా నడిపిస్తున్న కూటమి ప్రభుత్వానికే మా మద్దతు" అని వారు స్పష్టం చేశారు.

ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు విజన్, దూరదృష్టితో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు



తీసుకెళ్తున్నారని అన్నారు.

అలాగే శ్రీ పొంగూరు నారాయణ కార్యదక్షతతో నెల్లూరు నగరంలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తూ అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. అమరావతిని రాష్ట్ర రాజధానిగా జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందేలా తీర్చిదిద్దే కూటమి ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా, నారాయణ నాయకత్వంలో నెల్లూరు నగరాన్ని కూడా మరింత సుందరంగా, ఆధునికంగా తీర్చిదిద్దేందుకు కృషి జరుగుతోందని పేర్కొన్నారు.

నెల్లూరు నగర భవిష్యత్తు కోసం అభివృద్ధికి ఓటు కూటమికి అండ అంటూ ప్రజలను వారు కోరారు.

ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కిషోర్ గునుకుల, వీర మహిళ విజయలక్ష్మి గునుకుల, ప్రవల్లిక, శ్రీలక్ష్మి, కృష్ణవేణి, సుప్రియ, కృష్ణమోహన్ రెడ్డి, నాగేంద్ర బాలు, ప్రశాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పుట్టినరోజే మృత్యుఒడికి.. సూళ్లూరుపేట పాత్రికేయుడు నవీన్ అకాల మరణం

**- జర్నలిజం లోకంలో తీవ్ర విషాదం.. 36 ఏళ్లకే పాత్రికేయుడు నవీన్‌కుమార్ కన్నుమూత**

**సూళ్లూరుపేట, పెన్ పవర్, అక్టోబర్ 9**
కలంతో ప్రజాసమస్యల గొంతుకగా నిలిచిన ఓ యువ పాత్రికేయుడి అకాల మరణం సూళ్లూరుపేట ప్రాంత జర్నలిస్టు వర్గాల్లోనూ, స్థానికుల్లోనూ తీవ్ర విషాదాన్ని నింపింది. సూళ్లూరుపేట బిగ్ టీవీ ఛానెల్, పాత్రికేయుడు డి. నవీన్‌కుమార్ 36 అనారోగ్యంతో నెల్లూరులోనిఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు.ఎంతో ఉత్సాహంగా సాగాల్సిన నవీన్ కుమార్జన్మదినం అక్టోబర్ 8న ఆయన కుటుంబంలో, తోటి పాత్రికేయ మిత్రులలో కోలుకోలేని శోకాన్ని మిగిల్చింది. పుట్టినరోజే ఆయన తుదిశ్వాస విడవడంతో భార్య, ఇద్దరు చిన్నారుల రోదనలు అక్కడి వారిని కంటతడి పెట్టించాయి నవీన్ భౌతికకాయాన్ని సూళ్లూరుపేట మండలం ఆబాక లోని ఆయన స్వగృహానికి తరలించారు.మరణవార్త తెలుసుకున్న తోటి పాత్రికేయులు, ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు, పార్టీల నాయకులు ఆబాక కు చేరుకుని నవీన్ పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పాత్రికేయుడు నవీన్ మృతిపట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ, ఆయన కుటుంబానికి ప్రభుత్వం తరపున అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. గ్రామంలోని బంధువులు, మిత్రులు, తోటి పాత్రికేయుల కన్నీటి వీడ్కోలు మధ్య శుక్రవారంనవీన్‌కుమార్అంత్యక్రియలు




పూర్తయ్యాయి.చిన్న వయసులోనే ఎంతో చురుగ్గా ఉండే నవీన్ లేని లోటు పూడ్చలేనిదని తోటి పాత్రికేయులు శోకసంద్రంలో మునిగిపోయారు

# ఒకే దశలో పురపాలక ఎన్నికలు రెండు దశల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలపై పరిశీలన 3 దశల్లో పంచాయతీ ఎన్నికలు వివరాలు వెల్లడించిన ఏపీ ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర

**నెల్లూరు అక్టోబర్ 9 పెన్ పవర్ స్టేట్ బ్యూరో**
గ్రామ పంచాయతీలకు మూడు దశల్లో ఎన్నికలునిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిర్ణయించింది. పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీలకు ఒక దశలోనే నిర్వహించనున్నారు.ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు రెండు దశల్లో నిర్వహించే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిలచంద్ర పునేఠా తెలిపారు.

నోటిఫికేషన్ విడుదల చేసిన సమయం నుండి ఎన్నికల కోడ్ అమల్లోకినోటిఫికేషన్ వెలువడిన 14 రోజుల్లోనే పంచాయితీ ఎన్నికలు.. అదే రోజు ఫలితాలు15 రోజుల్లో పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల ఎన్నికలు. రెండు రోజుల్లో ఓట్ల లెక్కింపు ఫలితాలు16 రోజుల్లో MPTC,జడ్పీటీసీ ఎన్నికలు.. రెండు రోజుల తర్వాత ఫలితాలుపంచాయతీలకు మాత్రం పార్టీ రహితంగా ఎన్నికలుఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన రోజు నుంచి 14 రోజుల్లో పంచాయతీ ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని నిర్ణయించారు. పోలింగ్ ఉదయం 7 గంటలకు ప్రారంభమై ఒంటి గంటకు ముగియనుంది. అదేరోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్లు లెక్కించి, ఫలితాలు ప్రకటిస్తారు. పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల ఎన్నికలు నోటిఫికేషన్ నుంచి 15 రోజుల్లో, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు 16 రోజుల్లో పూర్తి చేయనున్నారు. పోలింగ్ పూర్తయిన రెండు రోజుల తరువాత వీటిలో ఓట్లు లెక్కించనున్నారు.

పంచాయతీ ఎన్నికలు పార్టీ రహితంగా.. మిగిలినవన్నీ పార్టీ పరంగా నిర్వహిస్తారు.

నోటిఫికేషన్, ఎన్నికల షెడ్యూల్ ఏది ముందు వెలువడితే.. అదే రోజు నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుంది.

ఎన్నికలకు మొత్తం 1,05,432 బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేశారు. తెలంగాణ నుంచి 17,650 బాక్సులు తెప్పించారు.

**ఎన్నికల నిర్వహణకు సిద్ధం: ఎస్ఈసీ**

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఎస్ఈసీ విలేకర్లతో మాట్లాడారు. 'అన్ని జిల్లాల్లోనూ ఎన్నికల నిర్వహణకు యంత్రాంగం సిద్ధంగా ఉంది. ఓటర్ల జాబితాలు, పోలింగ్ కేంద్రాలు, బ్యాలెట్ బాక్సు, మెటీరియల్ సిద్ధం చేశాం. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు రెండు దశల్లో నిర్వహించాలన్న సూచనలు పరిశీలించి నిర్ణయాన్ని వెల్లడిస్తాం' అని వివరించారు..

# నెల్లూరు రూరల్ అభివృద్దే మా లక్ష్యం





**- రూరల్ ప్రజలకు ఎంత చేసినా తక్కువే**
**- చరిత్ర చూడని అభివృద్ధిని నెల్లూరు రూరల్ లో చేస్తున్నాం**
**- టెంకాయ కొట్టామంటే పని పూర్తి కావలిసిందే**
**- తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి**

**నెల్లూరు అక్టోబర్ 9 పెన్ పవర్ నెల్లూరు బ్యూరో**
నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని పల్లెపండుగ 3.0 నిధులతో పెనుబర్తి, మాదరాజు గూడూరు, కాకుపల్లి గ్రామాలలో 1 కోటి 50 లక్షల రూపాయల వ్యయంతో సీ.సీ. రోడ్లకు శంకుస్థాపన శుక్రవారం చేసిన నెల్లూరు ఏఎంసీ ఛైర్మెన్ మనుబోలు శ్రీధర్ రెడ్డి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి. అనంతరం గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ

నెలరోజుల్లో ఈ అభివృద్ధి పనులను పూర్తిచేసి, ప్రజలకు అందుబాటులోకితీసుకువస్తాం.కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు , ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , యువనేత, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఆశీస్సులతో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి 970 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నారు.

కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి నెల్లూరు రూరల్ మండలంలో ఉన్న 18 గ్రామాల అభివృద్ధికి 134 కోట్ల రూపాయలను కేటాయించాము.

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీ అభ్యర్థులను ఆశీర్వదించండి.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో నెల్లూరు రూరల్ లో 100 కి 100 శాతం గెలిపించి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వద్ద రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి గౌరవాన్ని పెంచాలని కోరుతున్నా.

పై కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమము





**పెన్ పవర్ రొంపిచర్ల మండలం అక్టోబర్ 9**
రొంపిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. వినయ్ ఈరోజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమమును నిర్వహించి. గర్భవతులందరికీ రాజేశ్వరి మండల ఆరోగ్య విద్యాధికారి ఆరోగ్య అవగాహన కల్పిస్తు అధిక పోషకాలు కలిగిన ఆహారం ప్రతి గర్భిణి తీసుకోవాలని, రక్త హీనత కలగకుండా గర్భిణీ స్త్రీలు తీసుకొనే ఆహారంలో తాజా ఆకుకూరలు , తాజా కాయగూరలు, తాజా పండ్ల రసాలు తీసుకోవాలని అంగన్వాడీ కేంద్రము లో అందించే, డ్రై ఫ్రూట్ లు పాలు , కోడి గుడ్లు తీసుకోవటం వలన రక్త హీనత కలగకుండా ఉంటుంది పుట్టబోయే శిశువు ఆరోగ్యముగా పుట్టతారు అని తెలిపారు.

తదనంతరం ప్రమాదకరం లక్షణాలు లేని గర్భిణీ స్త్రీలు, సాధారణ గర్భిణీ స్త్రీలు రెండో కానుపు కు అర్హులైన గర్భిణీ స్త్రీలకు రొంపిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో ప్రసవాలు చేసుకోవాలని తెలిజేశారూ. శిశువు పుట్టిన వెంటనే తల్లి పాలు తాగించాలి, ఈ ముర్రుపాలు ఈ పాలల్లో అత్యధిగా పోషకాలు వుండటం వల్ల శిశువులకు పుట్టిన వెంటనే ఈ పాలు పట్టించడం వలన వ్యాధి నిరోధక శక్తి కలిగి వ్యాధులు కలగకుండా ఉంటుంది. ఈ కార్యక్రమంలో అమ్మాణ్ణి సి.హెచ్.ఓ,పంకజ హెల్త్ సూపర్వైజర్ యం. ఎల్. పి లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు మరియు అంగన్వాడీ కార్యకర్తలు హాజరైనారు

# పాముకాటు రూపంలో విషాదం.. జనసైనికుడి కుటుంబానికి జనసేన అండ!

## అన్నపూర్ణ మృతి పట్ల దండి నరేంద్ర ప్రగాఢ సంతాపం

శ్రీకాళహస్తి, పెన్ పవర్,అక్టోబర్ 09:
శ్రీకాళహస్తి మండలం రామానుజపల్లి గ్రామానికి చెందిన జనసైనికుడు శ్రీనివాసులు కుటుంబంలో చోటుచేసుకున్న విషాద ఘటన పట్ల జనసేన పార్టీ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శ్రీనివాసులు సతీమణి అన్నపూర్ణ (48) ఇంటి వద్ద పాముకాటుకు గురై, తిరుపతిలోని పలు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో చికిత్స పొందినప్పటికీ ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విచారకరమని జనసేన నాయకులు పేర్కొన్నారు.ఈ విషయం తెలుసుకున్న జనసేన పార్టీ నాయకులు దండి నరేంద్ర, శ్రీకాళహస్తి ఆలయ బోర్డు సభ్యులు, జనసేన సీనియర్ నాయకులు దండి రాఘవయ్యతో



కలిసి రామానుజపల్లిలోని మృతురాలి నివాసానికి వెళ్లారు. అన్నపూర్ణ భౌతికకాయానికి నివాళులర్పించి, ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారికి మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.అన్నపూర్ణ మృతి ఆ కుటుంబానికి తీరని లోటని, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ఆప్తురాలిని కోల్పోయిన కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని తెలియజేస్తూ, ఈ విషాదాన్ని తట్టుకునే శక్తిని దేవుడు ప్రసాదించాలని కోరుకున్నారు.కష్టసమయంలో అండగా నిలవడమే జనసేన స్ఫూర్తిఈ సందర్భంగా దండి నరేంద్ర మాట్లాడుతూ, జనసేన పార్టీ కేవలం రాజకీయాలకే పరిమితం కాదని, పార్టీ కోసం పనిచేసే జనసైనికులకు, వారి కుటుంబాలకు కష్టసుఖాల్లో అండగా నిలవడం కూడా తమ బాధ్యత అని పేర్కొన్నారు. జనసైనికుడి కుటుంబంలో విషాదం చోటుచేసుకున్నప్పుడు ఆ కుటుంబానికి అండగా నిలవడం మానవతా దృక్పథంతో కూడిన బాధ్యత అని తెలిపారు.జనసైనికుల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని, ఇలాంటి కష్టసమయాల్లో వారి బాధను పంచుకుంటూ మనోధైర్యాన్ని అందించడం జనసేన పార్టీ స్ఫూర్తిలో భాగమని దండి నరేంద్ర పేర్కొన్నారు.

మృతురాలు అన్నపూర్ణకు నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపిన వారిలో జనసేన నాయకులు, స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.

# అనుభవానికి పట్టం కడితే.. నాయుడుపేట అభివృద్ధికి కొత్త దిశ!



- సన్నారెడ్డి దయాకర్ రెడ్డికి మున్సిపల్ చైర్మన్‌గా అవకాశం కల్పించాలి..
- విద్యార్థి దశ నుంచి జాతీయ స్థాయి వరకు రాజకీయ ప్రస్థానం..
- నాయుడుపేట అభివృద్ధికి ఆయన నాయకత్వం అవసరం!

**నాయుడుపేట, పెన్ పవర్, అక్టోబర్ 9**

తిరుపతి జిల్లా నాయుడుపేటలో స్థానిక సంస్థ ఎన్నికల పైన రోజురోజుకీ వేడెక్కుతున్న రాజకీయం. నాయుడుపేట లో విద్యార్థి దశలోనే ప్రజాసేవను లక్ష్యంగా ఎంచుకుని, అంచెలంచెలుగా ఎదుగుతూ వివిధ స్థాయిల్లో రాజకీయ బాధ్యతలు నిర్వహించిన నాయకుడు సన్నారెడ్డి దయాకర్ రెడ్డి. అలాంటి అనుభవం, నాయకత్వ లక్షణాలు, రాజకీయ పరిచయాలు కలిగిన ఆయనకు నాయుడుపేట మున్సిపల్ చైర్మన్‌గా అవకాశం కల్పిస్తే పట్టణ అభివృద్ధికి కొత్త దిశ ఏర్పడుతుందని ఆయన అభిమానులు, మద్దతుదారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**విద్యార్థి దశ నుంచే నాయకత్వ ప్రస్థానం!**

సన్నారెడ్డి దయాకర్ రెడ్డి తన ఇంటర్మీడియట్ విద్యాభ్యాస సమయంలోనే అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) కార్యకర్తగా ప్రజా జీవితంలోకి అడుగుపెట్టారు. అనంతరం నెల్లూరు జిల్లా కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. విద్యార్థి ఉద్యమాల నుంచి ప్రారంభమైన ఆయన రాజకీయ ప్రస్థానం, తదనంతరం భారతీయ జనతా యువమోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్థాయికి చేరుకుంది.

ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చిన తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి సన్నిధిలోని తిరుపతి జిల్లాలో భారతీయ జనతా పార్టీ జిల్లా సారథిగా బాధ్యతలు నిర్వహించారు. అనంతరం బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రెండుసార్లు పార్టీకి సేవలందించడంతో పాటు, జాతీయ కార్యవర్గ సభ్యుడిగా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్నారని ఆయన మద్దతుదారులు పేర్కొంటున్నారు.

**అనుభవం ఉంది.. నాయకత్వ పటిమ ఉంది.. మరి నాయుడుపేటకు అవకాశం ఎందుకు ఇవ్వకూడదు?**

విద్యార్థి సంఘం నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయి రాజకీయ బాధ్యతల వరకు ప్రయాణించిన నాయకుడికి స్థానిక పట్టణ అభివృద్ధి బాధ్యతలు అప్పగిస్తే తన అనుభవాన్ని ప్రజల కోసం వినియోగించే అవకాశం ఉంటుందని ఆయన అభిమానులు అభిప్రాయపడుతున్నారు.

నాయుడుపేట మున్సిపాలిటీలో తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, పారిశుధ్యం, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాల మెరుగుదలతో పాటు పట్టణాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని వారు పేర్కొంటున్నారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి నిధులు, ఉన్నత స్థాయి రాజకీయ పరిచయాలను ప్రజా ప్రయోజనాలకు ఉపయోగించుకునే దిశగా కృషి చేసే నాయకత్వం పట్టణానికి అవసరమని చెబుతున్నారు.

**పదవి కోసం కాదు.. పట్టణ ప్రగతి కోసం!**

నాయుడుపేట మున్సిపల్ చైర్మన్ పదవి అనేది కేవలం ఒక హోదా కాదు.. పట్టణ భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత! విద్యార్థి దశ నుంచి రాజకీయాల్లో పనిచేసి, వివిధ స్థాయిల్లో అనుభవం సంపాదించిన సన్నారెడ్డి దయాకర్ రెడ్డికి ఆ బాధ్యత అప్పగిస్తే నాయుడుపేట అభివృద్ధి కోసం సమర్థవంతంగా పనిచేసే అవకాశం ఉంటుందని ఆయన మద్దతుదారులు పేర్కొంటున్నారు.

రాజకీయ అనుభవాన్ని ప్రజా సేవకు అనుసంధానం చేస్తూ, పట్టణ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ, నాయుడుపేటను అభివృద్ధి పథంలో ముందుకు నడిపించాలంటే ఆయనకు అవకాశం కల్పించాలని వారు కోరుతున్నారు.

**నాయుడుపేట అభివృద్ధి కోసం ఒక బలమైన నిర్ణయం అవసరం!....**

విద్యార్థి దశ నుంచి జాతీయ స్థాయి వరకు సాగిన రాజకీయ ప్రస్థానం.. ప్రజా జీవితంలో సంపాదించిన అనుభవం.. అభివృద్ధి పట్ల నిబద్ధత.. ఈ లక్షణాలను నాయుడుపేట ప్రయోజనాలకు ఉపయోగించుకునే అవకాశం రావాలి!

సన్నారెడ్డి దయాకర్ రెడ్డికి నాయుడుపేట మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలు అప్పగిస్తే, పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు తన అనుభవాన్ని వినియోగిస్తారనే ఆశాభావాన్ని ఆయన అభిమానులు వ్యక్తం చేస్తున్నారు. నాయుడుపేట అభివృద్ధికి దోహదపడే నాయకత్వానికి అవకాశం కల్పించాలని వారు కోరుతున్నారు.

నాయుడుపేటకు కావాల్సింది కేవలం ఒక చైర్మన్ కాదు.. అభివృద్ధిపై స్పష్టమైన దృష్టి, రాజకీయ అనుభవం, ప్రజల సమస్యలపై స్పందించే నాయకత్వం! అలాంటి అవకాశం సన్నారెడ్డి దయాకర్ రెడ్డికి కల్పించాలని ఆయన మద్దతుదారులు ఆకాంక్షిస్తున్నారు.

# బీసీలకు 34 శాతం రిజర్వేషన్లను సుప్రీంకోర్టు కొట్టి వేసినా, ఇచ్చిన మాట ప్రకారం తెలుగుదేశం పార్టీ బీసీలకు న్యాయం చేస్తుంది.





- వైసీపీ నేతలు కోర్టుకు వెళ్లి 34శాతం రిజర్వేషన్లను అడ్డుకుని బీసీలకు తీరని ద్రోహం చేశారు.
- రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రాజకీయంగా సముచిత స్థానం కల్పిస్తాం.
- బీద రవిచంద్ర, శాసనమండలి సభ్యులు, టీడీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షులు.

**నెల్లూరు అక్టోబర్ 9 పెన్ పవర్ నెల్లూరు బ్యూరో**

చట్టసభల్లో బీసీలు ప్రాతినిధ్యం వహించే విధంగా వారికి సముచిత స్థానం కల్పించడమే టీడీపీ లక్ష్యం.

బీసీలు రాజకీయంగా, సామాజికంగా ఎదగకూడదని గొడ్డలి పార్టీ నేతలు కుట్రలు చేస్తున్నారు.

బీసీలకు సామాజిక, రాజకీయ న్యాయం చేయాలన్నదే టీడీపీ లక్ష్యం, వారి హక్కులను అడ్డుకోవడమే వైసీపీ వైఖరి.

త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 34 శాతం అవకాశాలను ఇచ్చి బడుగు బలహీన వర్గాల రాజకీయ అభివృద్ధికి తెలుగుదేశం పార్టీ కృషి చేస్తుంది.

బీసీల హక్కుల కోసం టీడీపీ నిరంతరం పోరాడుతుంది, వారి అభ్యున్నతికి కట్టుబడి ఉంటుంది.

బీసీలకు 34శాతం రిజర్వేషన్ అంశాన్ని వైసిపి హయాంలో హైకోర్టు కొట్టివేస్తే సుప్రీంకోర్టుకు వెళ్లకుండా బీసీలను తీరని అన్యాయం చేశారు.బీసీల అభ్యున్నతి, ఆర్థిక, రాజకీయ, సామాజిక న్యాయం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యం.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బడుగు బలహీన వర్గాలకు 34% రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 105, 1065 లను వైసీపీ నేత శివప్రసాద్ రెడ్డి పిటిషన్ ద్వారా అడ్డుకున్నారు.

వైసీపీ హయాంలో 34 శాతం రిజర్వేషన్ అమలు చేసినట్లయితే 16,800 మంది బీసీలు నాయకులుగా ఎదిగేవారు.ఇటువంటి అద్భుత అవకాశాన్ని నీరుగార్చి బీసీల అభ్యున్నతికి వైసీపీ ప్రభుత్వం తమ హయాంలో రాజకీయ సమాధి కట్టింది.పంచాయతీ సర్పంచ్ నుంచి ఎంపీటీసీ, జడ్పీటీసీలు, మేయర్లు, జడ్పీ చైర్మన్లుగా బీసీలు ఎదిగే అవకాశాన్ని దూరం చేసిన చరిత్ర గొడ్డలి పార్టీ ది.

# యువతకు ఉపాధి బాటలు.. జనసేన జాబ్ మేళాతో భరోసా!

## 150 మందికి ఇంటర్వ్యూలు.. సుమారు 80 మందికి ఉద్యోగావకాశాలు







**శ్రీకాళహస్తి పెన్ పవర్ అక్టోబర్ 09:**

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించి, వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయడమే లక్ష్యంగా జనసేన పార్టీ ముందడుగు వేస్తోంది.

జనసేన పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా శ్రీకాళహస్తి పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు.

ఈ జాబ్ మేళాకు శ్రీకాళహస్తి పట్టణంతో పాటు పరిసర గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువతీ యువకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. బ్లూ స్టార్, హావెల్స్, డిక్సన్ తదితర ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొని, తమ సంస్థల్లో అందుబాటులో ఉన్న ఉద్యోగావకాశాలు, ఉద్యోగ బాధ్యతలు, పని విధానంపై అభ్యర్థులకు అవగాహన కల్పించారు.

అనంతరం నిర్వహించిన ఇంటర్వ్యూలలో మొత్తం 150 మంది నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొనగా, వారిలో సుమారు 80 మందికి ఉద్యోగావకాశాలు లభించాయి. దీంతో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతలో కొత్త ఆశలు చిగురించాయి.

**ఈ సందర్భంగా కొట్టే సాయి ప్రసాద్ మాట్లాడుతూ,**

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా జనసేన పార్టీ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా స్థానిక కంపెనీల సహకారంతో ప్రతి నెలా జాబ్ మేళాలు నిర్వహించి, శ్రీకాళహస్తి నియోజకవర్గ యువతకు మరిన్ని ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. యువత స్వయం సమృద్ధి సాధించడంతో పాటు తమ కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలవాలన్నదే తమ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. స్థానిక యువతకు వారిప్రాంతంలోనేఉద్యోగావకాశాలుఅందుబాటులోకి తీసుకురావడం ద్వారా నిరుద్యోగ సమస్యను తగ్గించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో బ్లూ స్టార్ కంపెనీ ప్రతినిధి రమేష్, రాయలసీమ కోఆర్డినేటర్ మాధవ్ మహేష్, కుమార్, ఢిల్లీ బాబు, గిరి, ఆర్‌టిడి తహసీల్దార్ చంద్రశేఖర్, బీజేపీ నాయకులు గరికపాటి చంద్రశేఖర్ బాబు, గరికపాటి రమేష్, నియోజకవర్గ యానాది సంఘం నాయకులు చందమామల కోటయ్య, జనసేన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తి అభివృద్ధికి రూ.27 కోట్ల నిధులు..!







- ఎస్‌డీకే నగర్‌లో రూ.4 కోట్ల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి శంకుస్థాపన
- ప్రతి వార్డులో మౌలిక వసతుల కల్పనే లక్ష్యం స్థానిక ప్రజల్లో హర్షాతిరేకం

**శ్రీకాళహస్తి, పెన్ పవర్, అక్టోబర్ 09:**

శ్రీకాళహస్తి పట్టణ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించింది. పట్టణాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్ ఏ ఎం) పథకం కింద శ్రీకాళహస్తి పురపాలక సంఘానికి మంజూరైన రూ.27 కోట్ల అభివృద్ధి పనుల్లో భాగంగా, ఎస్‌డీకే నగర్‌లో రూ.4 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు స్థానిక ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి శంకుస్థాపన చేశారు.

టీడీపీ నాయకులు, కూటమి ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే శాస్త్రోక్తంగా కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంతో ఎస్‌డీకే నగర్‌లో మౌలిక వసతులు మెరుగుపడతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు.

నాణ్యమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.. పట్టణ ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఎస్‌డీకే నగర్‌లో నాణ్యమైన సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, రక్షిత తాగునీటి సదుపాయాలు, వీధి దీపాల ఏర్పాటు వంటి పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, నిర్ణీత సమయంలో పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరేలా పనులు చేపట్టాలని సూచించారు.

ప్రతి వార్డుకు అభివృద్ధి ఫలాలు

హెచ్ ఏ ఎం పథకం ద్వారా మంజూరైన రూ.27 కోట్ల నిధులతో శ్రీకాళహస్తి పట్టణంలోని మౌలిక వసతులను మరింత మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. పట్టణంలోని ప్రతి వార్డులో ప్రజలకు అవసరమైన సదుపాయాలను గుర్తించి, దశలవారీగా అభివృద్ధి పనులు చేపడతామని వివరించారు.

రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, వీధి దీపాలు వంటి ప్రాథమిక సదుపాయాల అభివృద్ధితో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తగ్గించవచ్చని పేర్కొన్నారు. అభివృద్ధిపనులఅమలులో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రజల అవసరాలకు అనుగుణంగా పనులను పూర్తి చేయాలని సూచించారు.

అభివృద్ధి పనులతో స్థానికుల్లో ఆనందం

ఎస్‌డీకే నగర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన జరగడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. మౌలిక వసతులు మెరుగుపడితే తమ దైనందిన జీవనంలో ఎదురయ్యే సమస్యలు తగ్గుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. పట్టణ అభివృద్ధికి నిధులు కేటాయించి పనులు ప్రారంభించడం పట్ల సంతృప్తి తెలిపారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ కమిషనర్, సంబంధిత అధికారులు, స్థానిక నాయకులు, ఎస్‌డీకే నగర్ నివాసితులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# మాధవగిరిపల్లి అభివృద్ధికి రూ.75 లక్షలు!







- పల్లె పండుగ 3.0లో బీటీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి శ్రీకారం
- మాధవగిరిపల్లి ఎస్సీ కాలనీకి మహర్దశ.. రహదారి సౌకర్యం మెరుగుపరిచేందుకు చర్యలు

**శ్రీకాళహస్తి, పెన్ పవర్ ,అక్టోబర్ 09:**

గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చేపట్టిన 'పల్లె పండుగ 3.0' కార్యక్రమంలో భాగంగా శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శ్రీకాళహస్తి మండలం మాధవగిరిపల్లి ఎస్సీ కాలనీలో రూ.75 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు శుక్రవారం శ్రీకారం చుట్టారు.

స్థానిక ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజల సమక్షంలో శాస్త్రోక్తంగా భూమిపూజ నిర్వహించి రహదారి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీలో రహదారి సౌకర్యం మెరుగుపడనుండటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

**గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలను మెరుగుపరచడంతో పాటు ప్రతి కాలనీలో అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే తమ లక్ష్యమని తెలిపారు. ముఖ్యంగా ఎస్సీ కాలనీల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

మాధవగిరిపల్లి ఎస్సీ కాలనీలో గతంలో సరైన రహదారి సౌకర్యం లేక స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రూ.75 లక్షలతో నూతన బీటీ రోడ్డు నిర్మాణాన్ని చేపడుతున్నట్లు వివరించారు. ఈ రహదారి అందుబాటులోకి వస్తే కాలనీవాసుల రాకపోకలు మరింత సులభతరమవడంతో పాటు రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని తెలిపారు.

**నాణ్యతలో రాజీ వద్దు.. నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలి**

రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు సూచించారు. పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అభివృద్ధి పనుల విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా, ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరేలా నిర్మాణాలు చేపట్టాలని సూచించారు.

శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, ప్రతి కాలనీకి అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తూ అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. గ్రామీణ రహదారుల అభివృద్ధి, మెరుగైన రవాణా సౌకర్యాలు, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు.

**ఎమ్మెల్యేకు కాలనీవాసుల కృతజ్ఞతలు**

ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ నాయకులు,పంచాయతీ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, మాధవగిరిపల్లి ఎస్సీ కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రహదారి నిర్మాణ పనులు ప్రారంభం కావడంపై స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

రూ.75 లక్షలతో చేపట్టిన ఈ రహదారి నిర్మాణం పూర్తయితే మాధవగిరిపల్లి ఎస్సీ కాలనీలో రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు స్థానికుల రోజువారీ ప్రయాణాలకు వెసులుబాటు కలగనుంది.

# శ్రీకాళహస్తిలో అంతరిక్ష విజ్ఞాన సందడి!విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలకు ఇస్రో వేదిక

- ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత: ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి

**శ్రీకాళహస్తి, పెన్ పవర్, అక్టోబర్ 09:**

విద్యార్థుల్లోఅంతరిక్షవిజ్ఞానంపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు, శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చేందుకు ఇస్రో చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్‌పీబీఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (ఎస్ డిఎస్ సి ఎస్ హెచ్ ఏ ఆర్), శ్రీహరికోట ఆధ్వర్యంలో నిర్వహించిన 'వరల్డ్ స్పేస్ వీక్' వేడుకలు విద్యార్థుల్లో నూతన ఉత్సాహాన్ని నింపాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి అంతరిక్ష విజ్ఞాన ప్రదర్శనలను ప్రారంభించి, విద్యార్థులతో కలిసి వాటిని ఆసక్తిగా తిలకించారు.

**అంతరిక్ష విజ్ఞానంపై ఆసక్తి పెంచుకోవాలి**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నేటి విద్యార్థులే రేపటి శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులని పేర్కొన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే శాస్త్ర సాంకేతిక రంగాలపై ఆసక్తి పెంచుకుని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. నిరంతర అధ్యయనం, క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగితే అంతరిక్ష పరిశోధనల వంటి ప్రతిష్ఠాత్మక రంగాల్లోనూ ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని తెలిపారు.

శ్రీకాళహస్తి ప్రాంతంలోని విద్యార్థులకు అంతరిక్ష పరిశోధనలు, ఉపగ్రహాలు, అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించేలా ఇలాంటి విజ్ఞాన ప్రదర్శనను ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. విద్యార్థులకు విజ్ఞానాన్ని ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం కల్పించిన ఇస్రో, షార్ అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

**నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత**



పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ నీటి ప్రాముఖ్యతను ఎమ్మెల్యే వివరించారు. నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలని, భవిష్యత్తు తరాలకు నీటి వనరులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని స్పష్టం చేశారు. ఎల్‌నినో (జుశ్రీ చీటేశీ) వంటి వాతావరణ దృగ్విషయాలు వాతావరణ పరిస్థితులపై చూపే ప్రభావాలను అర్థం చేసుకోవడంతో పాటు, ప్రకృతిలో చోటుచేసుకునే మార్పులపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని సూచించారు.

పర్యావరణాన్ని కాపాడటం, నీటి వనరులను సంరక్షించడం, ప్రకృతి పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించడం వంటి అలవాట్లను విద్యార్థులు తమ జీవితాల్లో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

**ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల మెరుగుదల, విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థులకు మెరుగైన భవిష్యత్తును అందించే దిశగా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కూడా ఆధునిక విజ్ఞానం, సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి





రావడం ఎంతో అవసరమని, ఇలాంటి కార్యక్రమాలు వారి ఆలోచనా పరిధిని విస్తృతం చేయడంతో పాటు భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు ప్రేరణనిస్తాయని తెలిపారు.విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథానికి ఇస్రో ప్రోత్సాహం

**ఈ సందర్భంగా ఇస్రో శాస్త్రవేత్తలు మాట్లాడుతూ..** విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించేందుకు, అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తిని కలిగించేందుకు వరల్డ్ స్పేస్ వీక్ వంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. అంతరిక్ష విజ్ఞాన ప్రదర్శనల ద్వారా విద్యార్థులు పుస్తకాల్లో చదివిన అంశాలను ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం లభిస్తుందని వివరించారు.శ్రీకాళహస్తిలో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి అందించిన సహకారం, చూపిన ప్రత్యేక శ్రద్ధను శాస్త్రవేత్తలు ప్రశంసించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఇస్రో అధికారులు, స్థానిక నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అంతరిక్ష విజ్ఞాన ప్రదర్శనను విద్యార్థులు ఎంతో ఆసక్తిగా తిలకిస్తూ వివిధ అంశాలపై అవగాహన పెంపొందించుకున్నారు.

# సీట్ల సర్దుబాటు ఎలా

**విజయవాడ, అక్టోబరు 9, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగనున్న వేళ, అధికార ఎన్డీయే కూటమిలో సీట్ల సర్దుబాటు అత్యంత సంక్లిష్టమైన ఘట్టంగా మారింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఉండవల్లిలో సమావేశమై పొత్తులు, మేయర్, జెడ్పీటీసీ, చైర్‌పర్సన్ స్థానాల విభజనపై సుదీర్ఘంగా చర్చించారు. అసెంబ్లీ , పార్లమెంట్ ఎన్నికల్లో అగ్రనేతలు ఇద్దరూ కలిసి ఒక నిర్ణయం తీసుకుంటే నియోజకవర్గ స్థాయి వరకు కేడర్ క్రమశిక్షణతో పనిచేసింది. కానీ, గ్రామీణ, పట్టణ స్థాయి పోలింగ్ బూత్‌ల వద్ద ముఖాముఖి తలపడే స్థానిక పోరులో కేవలం బాబు-పవన్‌ల భేటీలు,పిలుపులు కింది స్థాయి శ్రేణులను పూర్తిగా ఒకే తాటిపైకి తేగలవా అనేది ఇప్పుడు ఏపీ రాజకీయంలో అసలైన ప్రశ్న.శాసనసభ ఎన్నికల్లో 21 స్థానాల్లో పోటీ చేసి 100% స్ట్రైక్ రేట్ సాధించిన తర్వాతజనసేన కేడర్ ఆత్మవిశ్వాసం, ఆకాంక్షలు ఆకాశాన్ని తాకాయి. సార్వత్రిక ఎన్నికల సమయాన రాష్ట్ర ప్రయోజనాల కోసం 21 సీట్లకే పరిమితమయ్యామని, స్థానిక సంస్థల ఎన్నికల్లో మాత్రం తమ ఆత్మగౌరవానికి భంగం కలగనివ్వబోమని పవన్ కళ్యాణ్ తో పాటు జనసేన ముఖ్య నేతలు స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో వార్డు సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల్లోజనసేన గ్రాఫ్ బలంగా ఉందని, అసెంబ్లీ ఎన్నికల నాటి ఫార్ములా ఇక్కడ వర్తించదని కేడర్ ఇప్పటికే తెగేసి చెబుతోంది. 30 శాతానికి పైగా స్థానాలు దక్కించుకోవడం ద్వారా క్షేత్రస్థాయిలో సొంత నాయకత్వాన్ని బలపరుచుకోవాలని జనసేన పట్టుబడుతోంది.అటు తెలుగుదేశం పార్టీకి గ్రామీణ ఏపీలో ఐదు దశాబ్దాల బలమైన ఓటు బ్యాంకు, బూత్ స్థాయి బలగాలు ఉన్నాయి. గత ఐదేళ్లుగావైఎస్సార్‌సీపీ వేధింపులు ఎదుర్కొని, స్థానికంగా పార్టీ జెండాను నిలబెట్టిన టీడీపీ గ్రామ స్థాయి నేతలు ఈసారి ఎలాగైనా పదవులు చేజిక్కించుకోవాలని ఆరాటపడుతున్నారు. చంద్రబాబు ఎన్ని సర్దుబాట్లు చెప్పినా.. తమకు దక్కాల్సిన సర్పంచ్, ఎంపీటీసీ లేదా కౌన్సిలర్ సీటును జనసేనకో, బీజేపీకో కేటాయిస్తే ఊరుకునే




పరిస్థితి క్షేత్రస్థాయి టీడీపీ నేతల్లో లేదు. ఒకవేళ పార్టీ నుంచి అధికారికంగా బి-ఫామ్‌రాకపోయినా 'రెబెల్స్'గా అభ్యర్థులను దింపడానికో లేదా స్వతంత్రంగా పోటీ చేయడానికో స్థానిక టీడీపీ శ్రేణులు వెనుకాడేలా లేవు. ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ ఈ కూటమిలోని అసమ్మతిని అనుకూలంగామార్చుకోవడానికి వేచి చూస్తోంది. నియోజకవర్గ స్థాయిలో చంద్రబాబు, పవన్ ఎంత మైత్రిని ప్రదర్శించినా, పంచాయతీ, వార్డు స్థాయిలో కుటుంబాలు, పాత కక్షలు, వ్యక్తిగత ప్రాబల్యాలే గెలుపోటములనుశాసిస్తాయి. కూటమిలో సీటు దక్కని టీడీపీ లేదా జనసేన అసంతృప్త నేతలు తిరుగుబాటు అభ్యర్థులుగా పోటీ చేస్తే ఓట్లు చీలిపోవడం ఖాయం. ఆ చీలిక ద్వారా తాము పుంజుకోవచ్చని వైఎస్సార్‌సీపీఆశిస్తోంది. ఈ రకమైన సాంప్రదాయ స్థానిక వైరుధ్యాలను అగ్రనేతలు పైస్థాయి నుంచి నియంత్రించడం దాదాపు అసాధ్యమనే చెప్పాలి.ఈ క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొనేందుకు చంద్రబాబు బలం ఉన్న చోట మిత్రపక్షానికే ప్రాధాన్యం అనే ఫార్ములాను ప్రతిపాదించారు. అయితే, ఒక నిర్దిష్ట పంచాయతీలో లేదా వార్డులో టీడీపీకి ఎక్కువ బలముందా, లేక జనసేనకు ఉందా అని తేల్చడం కత్తిమీద సాము లాంటిది.పార్టీ కమిటీల నిర్వహణ, ఉమ్మడి సర్వేలు, నామినేటెడ్ పదవుల హామీలతో అసంతృప్తిని చల్లార్చాలని బాబు-పవన్ ప్రయత్నిస్తున్నప్పటికీ, అధికారం తలుపు తడుడుతున్న వేళ పదవుల కోసం ద్వితీయశ్రేణి నేతల మధ్య పోటీ రాపిడికి దారితీస్తోంది. రాష్ట్రస్థాయిలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌ల ఐక్యత ఎంత పటిష్టంగా ఉన్నప్పటికీ, స్థానిక ఎన్నికలు అనేది పూర్తిగా కింది స్థాయి నాయకుల ఉనికి, భవిష్యత్తుకుసంబంధించిన అంశం. పంచాయతీ, మున్సిపాలిటీ స్థాయిలో చోటుచేసుకునే ఫ్రెండ్లీ ఫైట్లు లేదా తిరుగుబాట్లు ప్రధాన కూటమి ఐక్యతను దెబ్బతీయకుండా, కేడర్‌ను సమన్వయం చేయడమే అమరావతి పెద్దలకు రాబోయే రోజుల్లో అతిపెద్ద సవాలు కానుంది.

# ఏపీలో కొత్త పార్టీకి స్పేస్ ఉందా

**విజయవాడ, అక్టోబరు 9, పెన్ పవర్:** ఏపీ రాజకీయం ఎప్పుడూ వేడిమీదే ఉంటుంది. అయితే ఇటీవల కాలంలో ఏపీ పొలిటికల్ స్క్రీన్‌పై సరికొత్త ట్రెండ్ కనిపిస్తోంది. జడ శ్రవణ్ కుమార్, రిటైర్డ్ ఐఏఎస్ విజయకుమార్, బీసీవై పార్టీ అధినేతరామచంద్ర యాదవ్, మాజీ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు, మాజీ సీబీఐ జాయింట్ డైరెక్టర్ ఎం. నాగేశ్వరరావు, కేకే సర్వేస్ కొండేటి కిరణ్.. చివరికి వైఎస్సార్‌సీపీ నుంచి దూరమైన రాజ్యసభ మాజీఎంపీ విజయసాయిరెడ్డి వరకు కొత్త రాజకీయ వేదికలు, పార్టీలు లేదా స్వతంత్ర రాజకీయం వైపు ప్రయాణిస్తుండటం చర్చనీయాంశమవుతోంది. అసలు ఏపీలో రాజకీయం అంటే అంత సింపుల్‌అయిపోయిందా? ప్రెస్ మీట్లు పెట్టడం, జెండా ఎగరేయడం, కొత్త పార్టీ అని ప్రకటించేయడం ఇంత సులువైన వ్యవహారమా? అనే ప్రశ్నలు సామాన్య ప్రజల నుంచి గట్టిగా వినిపిస్తున్నాయి. కొత్త పార్టీలస్థాపన వెనుక ప్రధానంగా మూడే మూడు అంశాలు కనిపిస్తున్నాయి. మొదటిది రిటైర్మెంట్ పొలిటికల్ అంబిషన్ , రెండోది సామాజిక వర్గాల ఆత్మగౌరవ పోరాటాలు , మూడోది ప్రధాన పార్టీల్లో అవకాశాలు దక్కక సొంత దుకాణం తెరవడం! కానీ, క్షేత్రస్థాయిలో ఒక రాజకీయ పార్టీని స్థాపించి, దానిని జిల్లాల వారీగా, మండలాల వారీగా కేడర్‌తో నిర్మించడం, భారీ ఎత్తున ఎన్నికల వ్యయాన్ని తట్టుకోవడం ఎంతసంక్లిష్టమైన విషయమో ఈ కొత్త నేతలు గుర్తించలేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. కేవలం టివి డిబేట్లు, సోషల్ మీడియా క్లిప్పింగులతో ఎన్నికల్లో నెగ్గుకురావచ్చనే భ్రమలోనే ఈ కొత్త పార్టీల హడావుడి సాగుతోంది.ఇక అసలైన ప్రశ్నకు వస్తే.. ఈ కొత్త రాజకీయ వేదికల్లో ఒక్కటైనా ప్రధాన పార్టీలైన తెలుగుదేశం , వైఎస్సార్‌సీపీ లేదా కూటమిలో భాగమైన జనసేన ఓటు బ్యాంకును చీల్చగలదా? దీనికిసమాధానం ఖచ్చితంగా లేదు అనే వస్తోంది. ఆంధ్రప్రదేశ్ ముఖాముఖి రాజకీయాలకు అలవాటుపడిన రాష్ట్రం. ఇక్కడ ఓటరు చాలా స్పష్టంగా అధికార-ప్రతిపక్షాల మధ్యే తన తీర్పును విభజిస్తాడు. గతంలో విపరీతమైన ప్రజాదరణ ఉన్న సినీ గ్లామర్, భారీ నిధులు ఉన్న చిరంజీవి , సుదీర్ఘకాలం పోరాడిన పవన్ కళ్యాణ్ ( కూడా ఓటు బ్యాంకును సీట్లుగా మార్చడానికి తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. అటువంటిదిఎటువంటి కేడర్, స్పష్టమైన సిద్ధాంతం లేని ఈ చిన్న పార్టీలు ప్రధాన పార్టీల గట్టి ఓటు బ్యాంకును కదిలించడం దాదాపు అసాధ్యం.జడ శ్రవణ్ లేదా రామచంద్ర యాదవ్ వంటి నేతలు బిసి, దళిత సామాజికవర్గాల ఓట్లను ప్రభావితం చేస్తామని ప్రకటిస్తున్నప్పటికీ, ఆయా సామాజిక వర్గాలు ఇప్పటికే సంక్షేమ పథకాలు, పొలిటికల్ రిజర్వేషన్ల ప్రాతిపదికన టీడీపీ-వైఎస్సార్‌సీపీల మధ్య స్పష్టంగా చీలిపోయి ఉన్నాయి. అలాగే రిటైర్డ్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులైన ఏబీ వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు లేదా సీనియర్ నేత విజయసాయిరెడ్డి వంటి వారు రాజకీయ వేదికలు పెట్టినా.. అవి కేవలం పట్టణ ప్రాంతమేధావులు, మీడియా రచ్చబండలకే పరిమితమవుతాయి తప్ప, గ్రామీణ పోలింగ్ బూత్‌లో ప్రభావం చూపే స్థాయికి వెళ్లలేవు. ఈ పార్టీల వల్ల ప్రధాన పార్టీలకు జరిగే ఒక్కే ఒక్క నష్టం.. ఓట్ల చీలిక ! హోరాహోరీ స్థానాల్లో ఈ చిన్న పార్టీలు లేదా స్వతంత్రులు చీల్చే కొన్ని వందల ఓట్లు ప్రధాన పార్టీల అభ్యర్థుల జాతకాలను తలకిందులు చేసే ప్రమాదం ఉంది. ఉదాహరణకు, బిసివై పార్టీ కొద్దిపాటి ఓట్లనుచీల్చినా, అది ఆ నియోజకవర్గంలో గెలిచే అభ్యర్థి మార్జిన్‌పై ప్రభావం చూపుతుంది. అంటే ఇవి ఓడించే లేదా గెలిపించే బలం లేని పార్టీలే కానీ, వోట్ కట్టర్ గా మాత్రమే ఉపయోగపడతాయి.ఏపీలో కొత్తపార్టీల హడావుడి అనేది కేవలం తాత్కాలిక మీడియా ఆకర్షణ , నేతల వ్యక్తిగత ఉనికి కాపాడుకునే ప్రయత్నం మాత్రమే! ఆంధ్రప్రదేశ్ రాజకీయ ప్లాట్‌ఫామ్‌పై బలమైన బూత్ నెట్‌వర్క్, వేల కోట్ల నిధులనిర్వహణ, పటిష్టమైన కేడర్ లేనిదే మనుగడ సాగించడం సాధ్యం కాదనేది చారిత్రక సత్యం. బాబు, జగన్, పవన్ లీడ్ చేస్తున్న ప్రధాన రాజకీయ కంబైన్లను దాటుకుని ఈ కొత్త కూటములు లేదా పార్టీలు ఒక్కశాసనసభ లేదా లోకల్ బాడీ స్థానాన్ని కూడా సొంతంగా ప్రభావితం చేయలేవని అనుకోవచ్చు.

# 34 శాతం బీసీ వర్గాలకు సాధ్యమేనా

**రాజమండ్రి అక్టోబరు 9, పెన్ పవర్:** ఏపీ రాజకీయం మళ్లీ పాత పద్ధతిలోకే వెళ్లింది. సుప్రీంకోర్టు విధించిన 50 శాతం రిజర్వేషన్ పరిమితి , క్రిష్ణమూర్తి కేసు తీర్పు ఆధారంగా రూపొందించిన ట్రిపుల్ టెస్ట్ విధానాన్ని అధిగమించడం అంత తేలికకాదు అని తెలిసినప్పటికీ, ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా 34% లేదా అంతకంటే ఎక్కువ రిజర్వేషన్ల ప్రతిపాదనతో జీవోలు తీసుకువచ్చింది. చట్టపరంగా నిలబడదని అందరికీ తెలుసు. హైకోర్టులో ఇటువంటినిర్ణయాలు సమీక్షకు వచ్చినప్పుడు 50 శాతం పరిమితి దాటకూడదని స్పష్టం కావడం దీనికి ప్రధాన నిదర్శనం. దీనివల్ల రిజర్వేషన్ల అంశం న్యాయస్థానాల్లో చిక్కుకోవడం, చివరికి పాత పద్ధతిలోనే ఎన్నికలు జరగడం లేదా ఆలస్యం కావడం పరిపాటిగా మారింది.అయితే, సాధ్యం కాదని తెలిసినా రాజకీయ పార్టీలు ఈ తప్పును పదే పదే ఎందుకు చేస్తాయి? అనేదే అసలు ప్రశ్న. దీని వెనుక ప్రధాన కారణం రాజకీయ క్రెడిట్ దక్కించుకోవడం , నెపం ప్రత్యర్థులపైకి నెట్టేయడం . 50 శాతానికి పైగా ఉన్న బీసీ జనాభా సింహభాగాన్ని ఆకట్టుకోవడానికి ప్రతీ అధికార పార్టీ తాము బీసీలకు గరిష్ట స్థాయిలో స్థానికపదవులు ఇస్తున్నామనే భావనను కల్పించడానికి ప్రయత్నిస్తుంది. ఆ తర్వాత కోర్టులు ఆ నిర్ణయాన్ని కొట్టివేస్తే, మేము ఇవ్వడానికి సిద్ధపడ్డాము కానీ కో ప్రత్యర్థి పార్టీలు వేసిన పిటిషన్ల వల్ల రద్దయ్యాయి అంటూ తమ తప్పును దాచుకునేందుకు , ప్రత్యర్థులను బీసీ వ్యతిరేకులు గా చిత్రీకరించేందుకు ఈ డ్రామా ఉపయోగపడుతుంది. గతంలో వైసీపీ ప్రభుత్వం హయాంలోనూ సరిగ్గా ఇదే తరహా పరిణామాలు చోటుచేసుకున్నాయి. 34% రిజర్వేషన్ జీవోలు తేవడం, అది కోర్టుల్లో రద్దు కావడం, ఆపై 24% కు తగ్గించి ఎన్నికలు నిర్వహించారు. ఇప్పుడు టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కూడా అదే తరహానిర్ణయాలతో ముందుకు వెళ్తోంది. ఇక తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం విషయంలోనూ కుల గణన, బీసీ రిజర్వేషన్ల పెంపు హామీల చుట్టూ ఇవే న్యాయపర మైన సవాళ్లు దాగి ఉన్నాయి. చట్టపరమైనవెసులుబాటు , సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసన తీర్పుల పరిమితిపై స్పష్టత ఉన్నప్పటికీ ఏ పార్టీ కూడా నిజం చెప్పే సాహసం చేయడం లేదు. ఒకవేళ పొలిటికల్ పార్టీలకు బీసీలకు న్యాయం చేయాలనేనిజమైన కట్టుబడి ఉంటే, చట్టపరమైన రిజర్వేషన్ల శాతం కోసం కోర్టులను ఆశ్రయించి కాలయాపన చేయడం కంటే పార్టీ బి-ఫామ్‌ల కేటాయింపులో తమ నిజాయితీని నిరూపించుకోవచ్చు.మునిసిపాలిటీలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు లేదా కార్పొరేషన్ ఎన్నికల్లో చట్టబద్ధంగా వచ్చే రిజర్వేషన్ శాతానికి అదనంగా, పార్టీల తరఫున జనరల్ స్థానాల్లోనూ బీసీ అభ్యర్థులకే టికెట్లు ఇచ్చి గెలిపించేవెసులుబాటు రాజకీయ పార్టీలకు ఉంది. కానీ ఏ పార్టీ కూడా జనరల్ స్థానాలను బీసీలకు ఇచ్చేందుకు సిద్ధపడదు. కేవలం రాజ్యాంగ పరిమితులకు లోబడి ఉండే ప్రభుత్వ రిజర్వేషన్ల పేరు చెప్పి కాలంవెళ్లదీస్తాయి. ఏ ప్రభుత్వం వచ్చినా ఈ రిజర్వేషన్ల కంటితుడుపు చర్యలు కేవలం ఎన్నికల నాటికి ఓటర్లను మభ్యపెట్టడానికే తప్ప క్షేత్రస్థాయిలో బీసీలకు దక్కే నికర ప్రయోజనం శూన్యమని నెటిజన్లుతీవ్రంగా విమర్శిస్తున్నారు.కోర్టు తీర్పుల సాకుతో పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలకు వెళ్లడం, పొలిటికల్ మైలేజ్ మాత్రం పొందే ప్రయత్నం చేయడం పరిపాటిగా మారింది.చట్టం పరిధి తెలిసీ ప్రజలను ఆశల్లో ముంచెత్తడం, ఆ తర్వాత న్యాయస్థానాల వైపు వేలు చూపించడం అనేది ఏపీ . ఇతర రాష్ట్రాల రాజకీయాల్లో ఒక ఫార్ములాగా మారిపోయింది. రాజకీయ పార్టీలు ఈ డ్రామాలను పక్కనపెట్టి, నిజాయితీగా పార్టీటికెట్ల పంపిణీలో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదా రాజ్యాంగ సవరణల దిశగా జాతీయ స్థాయిలో ఒత్తిడి తేడమే నిజమైన పరిష్కారమని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.

## ఎన్నికలు వాయిదా సాధ్యమేనా

**నెల్లూరు, అక్టోబరు 9, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీ ఎన్నికలకు ముందే రాజకీయ వేడి రాజుకుంది. ఒకవైపు బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న ప్రభుత్వ నిర్ణయం.. మరోవైపు అదే రిజర్వేషన్లను కోర్టులో సవాలు చేసినపిటిషన్లు.. తాజాగా హైకోర్టు తీర్పు.. ఆ తర్వాత సుప్రీంకోర్టు మెట్లెక్కిన రాష్ట్ర ప్రభుత్వం.. ఇదంతా కేవలం న్యాయపరమైన వివాదమేనా? లేక స్థానిక ఎన్నికల వెనుక పెద్ద రాజకీయ వ్యూహంనడుస్తోందా?ఆగస్టు 20, 2026న ఏపీ ప్రభుత్వం జారీ చేసిన +.ా.వీం.చీశీ.105 ద్వారా పంచాయతీరాజ్ సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించాలని నిర్ణయించింది. అయితే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు కలిపి 50 శాతం పరిమితిని దాటుతున్నాయంటూ పిటిషన్లు దాఖలయ్యాయి. అక్టోబర్ 1న ఏపీ హైకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. 34 శాతం బీసీ రిజర్వేషన్‌కు సంబంధించినప్రభుత్వ ఉత్తర్వులను రద్దు చేస్తూ.. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను వీలైనంత త్వరగా గరిష్ఠంగా ఆరు వారాల్లో ప్రారంభించాలని ఆదేశించింది.వైసీపీ వర్గాలు మాత్రం 34 శాతం బీసీ కోటా చట్టపరమైనపరిమితులను దాటుతుందని ముందే హెచ్చరించామని చెబుతున్నాయి. వైసీపీ అధికారిక వాదన ప్రకారం.. ప్రభుత్వం చట్టపరమైన సమస్యలు వస్తాయని తెలిసినా 34 శాతం కోటాను ప్రకటించి తర్వాత కోర్టుఅడ్డంకిని రాజకీయంగా ఉపయోగించుకుంటోందని ఆరోపిస్తోంది. మరోవైపు కూటమి ప్రభుత్వం మాత్రం బీసీలకు న్యాయం చేయాలన్న ఉద్దేశంతోనే 34 శాతం రిజర్వేషన్ తీసుకొచ్చామని చెబుతోంది.వైసీపీఅధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్థానిక ఎన్నికలను ఎదుర్కోవడానికి భయపడుతున్నారని, అందుకే బీసీ రిజర్వేషన్ల అంశాన్ని న్యాయపరమైన వివాదంగా మార్చి ఎన్నికలను ఆలస్యం చేయాలనిచూస్తున్నారని కూటమి వర్గాలు ఆరోపిస్తున్నాయి.పంచాయతీ ఎన్నికలు జరిగితే గ్రామస్థాయిలో అధికార పార్టీ, ప్రతిపక్షాల బలాబలాలు స్పష్టంగా బయటపడతాయి. ఎవరి క్యాడర్ బలంగా ఉంది? ఎవరినాయకత్వానికి గ్రామాల్లో ఆదరణ ఉంది? ఏ సామాజిక వర్గం ఎటువైపు నిలుస్తోంది? అన్నది ఎన్నికల ఫలితాలతో తేలిపోతుంది. అందుకే స్థానిక ఎన్నికలే ఇప్పుడు రెండు ప్రధాన పార్టీలకు రాజకీయపరీక్షగా మారాయి.స్థానిక సంస్థలకు కేంద్ర, రాష్ట్ర స్థాయిలో వివిధ గ్రాంట్లు, ఆర్థిక సంఘాల నిధులు, అభివృద్ధి నిధులు అందుతాయి. కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం 2021-26 కాలానికి ఆంధ్రప్రదేశ్ గ్రామీణస్థానిక సంస్థలకు 15వ ఆర్థిక సంఘం కింద రూ.10,231 కోట్ల కేటాయింపు ఉండగా రూ.10,055.82 కోట్లు విడుదలయ్యాయి. అయితే రూ.12,000 కోట్ల "పే కమిషన్ నిధులు"ఎన్నికలను ఆపడానికి జగన్ చేస్తున్న కుట్రలో భాగమే ఈ ఎన్నికలు అడ్డుకునే ప్రక్రియ అనే వాదన వినిపిస్తోంది.బీసీ రిజర్వేషన్లను వైసీపీ ఎందుకు అడ్డుకుంటోంది.? ప్రభుత్వం తీసుకొచ్చిన 34 శాతంకోటా చట్టపరమైన పరీక్షను ఎందుకు మోకాలడ్డుతోంది.? టీడీపీకి ఎన్నికల్లో ప్రయోజనం దక్కుండా చేసేందుకే ఈ కుట్ర చేస్తోంది.? ఎన్నికలు ఆలస్యం అయితే రాజకీయంగా వైసీపీకి లాభమా? గ్రామీణస్థాయిలో బలాబలాలు బయటపడకుండా ఎన్నికల ప్రక్రియను సాగదీయడం వైసీపీ వ్యూహమా? ఈ ప్రశ్నలకు సమాధానాలు రాబోయే రోజుల్లో కోర్టు తీర్పులతో పాటు రాజకీయ పరిణామాలు కూడాఇవ్వనున్నాయి.ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాలు చేసింది. అక్టోబర్ 9న ఈ అంశంపై సుప్రీంకోర్టులో తదుపరి విచారణ జరగనుంది. కాబట్టి.. ఇది కేవలం 34 శాతం బీసీరిజర్వేషన్ వివాదం కాదు. ఇది గ్రామీణ ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ ఆధిపత్యం కోసం జరుగుతున్న మరో పెద్ద పోరాటం.ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయి? బీసీలకు చివరకు ఎంత రిజర్వేషన్ దక్కుతుంది?కోర్టు నిర్ణయం ఎటువైపు ఉంటుంది? మరి ఈ మొత్తం వ్యవహారంలో రాజకీయంగా లాభపడేది ఎవరు? సమాధానం కోసం రాబోయే పరిణామాలను గమనించాల్సిందే!

## అర్ధరాత్రి ఫిషింగ్ హర్బర్ పనులను పరిశీలించిన మంత్రి కొల్లు

**మచిలీపట్నం పెన్ పవర్:** మంత్రి కొల్లు రవీంద్ర గురువారం అర్ధరాత్రి మచిలీపట్నం ఫిషింగ్ హార్బర్ కు వెళ్లారు. అర్ధాంతంగా పనులు నిలిపి వేయడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేసారు. అధికారుల బాధ్యతారాహిత్యం, గుత్తేదారు నిర్లక్ష్యవైఖరిపై అసహనం వ్యక్తం చేసారు. హార్బర్ నుండే కలెక్టర్ కు ఫోన్ చేసి మాట్లాడారు. కాంట్రాక్టర్ ఉద్దేశ్య పూర్వకంగా పనులు జాప్యం చేస్తున్నారని కలెక్టర్ కి ఫిర్యాదు చేసారు. మీరెందుకు దృష్టి పెట్టడం లేదనికలెక్టర్ ని ప్రశ్నించారు. మూడేళ్ల కాలపరిమితితో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఐదేళ్లు పూర్తయినా ఎందుకు పనులు పూర్తి చేయలేదో సమాధానం చెప్పాలని నిలదీసారు. అవసరమైతే కాంట్రాక్ట్ టెర్మినేట్ చేయాలని కలెక్టర్ కు ఆదేశాలు ఇచ్చారు. ఉన్నత స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేయాలని కలెక్టర్ కు సూచించారు. పనులు పూర్తి చేయడానికి నాలుగు నెలలు సమయం ఇవ్వాలని మంత్రిని గుత్తేదారు కోరారు. ఇంకెంత సమయం ఇవ్వాలని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేసారు. ఇప్పటికే రెండు సంవత్సరాలు కాల పరిమితిని పెంచినా పురోగతి లేదని మండిపడ్డారు. సీ మౌత్ డిజైన్ రాకపోవడం వల్ల పనుల్లో ఆలస్యం అయిందని గుత్తేదారు తెలిపాడు. కుంటిసాకులు ఇంకెన్ని రోజులు చెబుతారని గుత్తేదారుపై మంత్రి కొల్లు రవీంద్ర మండిపడ్డారు. ఇకపై ఉపేక్షించేది లేదని హెచ్చరికలు జారీ చేసారు. తక్షణం పనులు ప్రారంభించి నిర్ణీత సమయంలో పూర్తి చేయకపోతే తీవ్ర చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అవసరమైతే కాంట్రాక్ట్ టెర్మినేట్ చేసి కాంట్రాక్టర్ ఆస్తులు జప్తు చేస్తామని హెచ్చరించారు.

## రఘురామకు స్థానిక సంస్థల ఎన్నికల సెగ తగిలే ఛాన్స్ ఉందా?




ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజుకు స్థానిక సంస్థల ఎన్నికల్లో సెగ తగిలే అవకాశముంది. ఉండి నియోజకవర్గ ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణ రాజు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే ఆయన బలపర్చిన అభ్యర్థులకు కూటమిలోని నేతలే ప్రశ్నించే అవకాశాలున్నాయి. కూటమి పార్టీల ఓట్ల బదిలీపై కూడా అనుమానం తలెత్తుతుంది. పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల రాజకీయాలపై వివిధ రాజకీయ వర్గాల్లో ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వహిస్తున్న తొలి స్థానిక సంస్థల ఎన్నికలు ఇవి కావడంతో, రఘురామ కృష్ణరాజు సొంత నియోజకవర్గమైన ఉండిలో పార్టీని గెలిపించుకోవడం ఆయనకు ప్రతిష్టాత్మకంగా మారింది. ఆయన ఎమ్మెల్యేగా ఎన్నికయిన తర్వాత అనేక వివాదాలకు కేంద్రంగా మారారు. అదే సమయంలో సొంత పార్టీ నేతలను కూడా దూరం చేసుకున్నారు. అదే సమయంలో కూటమిలోని ఇతర పార్టీల నేతలు కూడా రఘురామ కృష్ణరాజు ను సమర్థించేవాళ్లు తక్కువగా ఉన్నారు.

**టిక్కెట్ల కేటాయింపు నుంచి...**

ఉండి నియోజకవర్గంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి నేతల మధ్య స్థానిక సంస్థల టికెట్ల కేటాయింపులో సయోధ్య కుదర్చడం రఘురామకృష్ణరాజుకు అత్యంత కీలకమైన అంశం. స్థానిక నేతల ఆశలు, అసంతృప్తులను సమన్వయం చేసుకోకపోతే అంతర్గత పోరు తగిలే అవకాశం ఉంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి 34 శాతం బీసీ రిజర్వేషన్లకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఇటీవలే మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు తుది నిర్ణయం ఆధారంగా మరికొద్దిరోజుల్లోనే టికి ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశం ఉంది. ఈ రిజర్వేషన్ల రొటేషన్ ప్రక్రియలో స్థానిక సమీకరణాలను బట్టి అభ్యర్థులను ఖరారు చేయడం స్థానిక ఎమ్మెల్యేగా రఘురామ కృష్ణరాజుకు ఒక పరీక్ష వంటిదే. గత ఎన్నికల్లో చివరి నిమిషంలో ఉండి నియోజకవర్గం ఎమ్మెల్యే టిక్కెట్ ను రఘురామ కృష్ణరాజు పొందగలిగారు.

**వైసీపీ కొంత కసిగానే...**

రఘురామ కృష్ణరాజు వాస్తవానికి పార్లమెంటుకు పోటీ చేయాలని భావించినా అది వీలు కాలేదు. వైసీపీ నుంచి బయటకు వచ్చి బీజేపీలో చేరదామని భావించి తిరిగి చివరి నిమిషంలో టీడీపీలో చేరి ఉండి టిక్కెట్ దక్కించుకున్నారు. రఘురామ కృష్ణరాజు గౌరవ ప్రదమైన డిప్యూటీ శాసనసభ స్పీకర్ పదవి లభించింది. అయితే ఆయన ఉండి నియోజకవర్గంలో తీసుకున్న పలు నిర్ణయాలు ఇబ్బందికరంగా మారాయి. మరొకవైపు ఆక్వా రైతులు కూడా దెబ్బకొట్టే అవకాశముంది. గతంలో వైఎస్సార్‌సీపీ నుంచి ఎంపీగా గెలిచి, ఆ తర్వాత ఆ పార్టీతో విభేదించి టీడీపీలో చేరిన రఘురామకృష్ణరాజుపై ఎలాగైనా పైచేయి సాధించాలని ప్రతిపక్ష వైసీపీ వ్యూహాలు ప్రతివ్యూహాలు రచిస్తోంది. ఉండి నియోజకవర్గ పరిధిలో స్థానిక ఎన్నికల ద్వారా తమ బలాన్ని నిరూపించుకోవాలని ప్రతిపక్షం గట్టిగా ప్రయత్నిస్తోంది.ప్రస్తుతం డిప్యూటీ స్పీకర్ హోదాలో రఘురామకృష్ణరాజు నియోజకవర్గంలో స్థానిక అభివృద్ధి కార్యక్రమాలు, దాతల సహకారంతో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టారు. క్షేత్రస్థాయిలో కూటమి ఓటు బ్యాంకును పటిష్టం చేసుకుంటూ, అసంతృప్తులను చల్లార్చగలిగితే ఎన్నికల సెగను తట్టుకుని ఆయన తన పట్టును నిలుపుకోగలరా? అన్నదే ప్రశ్న. చూడాలి రఘురామ ఈ స్థానిక సంస్థలను ఎలా నెగ్గుకొస్తారో...?

పెన్ పవర్
శనివారం 10 అక్టోబర్ 2026

# రాంచీలో భారత బ్యాటర్ల దంచుడు.. వెస్టిండీస్ ముందు అదిరిపోయే

రాంచీ టీ20లో చెలరేగిన భారత బ్యాటర్లు

వెస్టిండీస్ ముందు 250 పరుగుల కొండంత లక్ష్యం

సంజూ శాంసన్ మెరుపు ఇన్నింగ్స్.. 41 బంతుల్లో 82 పరుగులు

చివర్లో ఆకాశమే హద్దుగా చెలరేగిన శ్రేయస్ అయ్యర్, తిలక్ వర్మ

విండీస్ బౌలర్లలో ఒక్క రోస్టన్ చేజ్ మినహా అందరూ విఫలం



వెస్టిండీస్‌తో జరుగుతున్న రెండో టీ20 మ్యాచ్‌లో భారత బ్యాటర్లు విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగిపోయారు. రాంచీలోని జేఎస్‌సీఏ అంతర్జాతీయ స్టేడియం వేదికగా బ్యాటర్లు పరుగుల వరద పారించడంతో టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 249 పరుగుల భారీ స్కోరు సాధించింది. సంజూ శాంసన్ (82) అద్భుత అర్ధశతకంతో కదంతొక్కగా, ఇషాన్ కిషన్, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, తిలక్ వర్మ మెరుపు ఇన్నింగ్స్‌లతో జట్టు స్కోరును పరుగులు పెట్టించారు. దీంతో వెస్టిండీస్ ముందు 250 పరుగుల కొండంత లక్ష్యాన్ని నిర్దేశించారు.టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న వెస్టిండీస్ కెప్టెన్ రోవ్‌మన్ పావెల్ నిర్ణయం పూర్తిగా బెడిసికొట్టింది. ఇన్నింగ్స్ ఆరంభించిన అభిషేక్ శర్మ (20), సంజూ శాంసన్ ఆరంభం నుంచే దూకుడు ప్రదర్శించారు. ముఖ్యంగా పవర్‌ప్లేలో భారత బ్యాటర్లు విండీస్ బౌలర్లపై పూర్తి ఆధిపత్యం చెలాయించారు. కేవలం 3.5 ఓవర్లలోనే జట్టు స్కోరు 42 పరుగులకు చేరిన దశలో అభిషేక్ శర్మ ఔటయ్యాడు.అనంతరం క్రీజులోకి వచ్చిన స్థానిక హీరో ఇషాన్ కిషన్ (43) రావడంతోనే బ్యాట్ ఝుళిపించాడు. సంజూ, ఇషాన్ జోడి రెండో వికెట్‌కు కేవలం 43 బంతుల్లోనే 97 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. ముఖ్యంగా సంజూ శాంసన్ తనదైన శైలిలో క్లాస్, మాస్ షాట్లతో అలరించాడు. అయితే, అద్భుతంగా బౌలింగ్ చేసిన రోస్టన్ చేజ్.. ఇషాన్ కిషన్, శివమ్ దూబే (7), సంజూ శాంసన్‌లను స్వల్ప వ్యవధిలో పెవిలియన్ చేర్చి భారత్‌ను కాస్త కట్టడి చేసే ప్రయత్నం చేశాడు. సంజూ కేవలం 41 బంతుల్లో 9 ఫోర్లు, 4 సిక్సర్లతో 82 పరుగులు చేసి కీలక ఇన్నింగ్స్ ఆడాడు.

కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (40), తిలక్ వర్మ (44లి) ఆకాశమే హద్దుగా చెలరేగారు. ఆఖరి ఓవర్లలో ఈ ఇద్దరూ విండీస్ బౌలర్లకు చుక్కలు చూపించారు. కేవలం 32 బంతుల్లోనే 83 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి జట్టు స్కోరును 250 పరుగుల సమీపానికి తీసుకెళ్లారు. శ్రేయస్ 18 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 40 పరుగులు చేసి అవుట్ కాగా, తిలక్ వర్మ 18 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 44 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు.

వెస్టిండీస్ బౌలర్లలో స్పిన్నర్ రోస్టన్ చేజ్ ఒక్కడే ఆకట్టుకున్నాడు. తన 4 ఓవర్ల స్పెల్‌లో కేవలం 24 పరుగులిచ్చి 3 కీలక వికెట్లు పడగొట్టాడు. మిగతా బౌలర్లంతా భారీగా పరుగులు సమర్పించుకున్నారు. షమార్ స్ప్రింగర్ 4 ఓవర్లలో ఏకంగా 64 పరుగులు ఇచ్చాడు.

# పదేళ్ల తర్వాత టెస్టుల్లోకి.. చెత్త రికార్డుతో నిరాశపరిచిన ఆసీస్ బ్యాటర్

- దాదాపు పదేళ్ల తర్వాత టెస్టు జట్టులోకి తిరిగొచ్చిన నిక్ మ్యాడిన్సన్
- దక్షిణాఫ్రికాతో తొలి టెస్టులో 33 బంతులు ఆడి డకౌట్
- టెస్టుల్లో అత్యధిక బంతులు ఆడి డకౌటైన ఆస్ట్రేలియా ఓపెనర్‌గా చెత్త రికార్డు
- క్యాన్సర్‌ను జయించి పునరాగమనం చేసిన మ్యాడిన్సన్‌కు తీవ్ర నిరాశ
- 2016 తర్వాత మళ్లీ ఇప్పుడే టెస్టు మ్యాచ్ ఆడుతున్న ఆసీస్ బ్యాటర్



ఆస్ట్రేలియా క్రికెటర్ నిక్ మ్యాడిన్సన్ దాదాపు పదేళ్ల తర్వాత టెస్టు క్రికెట్‌లోకి పునరాగమనం చేశాడు. అయితే, ఈ ఎమోషనల్ కమ్‌బ్యాక్ అతనికి తీవ్ర నిరాశను మిగిల్చింది. దక్షిణాఫ్రికాతో డర్బన్‌లో జరుగుతున్న తొలి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో 33 బంతులు ఎదుర్కొని పరుగులేమీ చేయకుండా డకౌట్‌గా వెనుదిరిగాడు. దీంతో ఒక చెత్త రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు.శుక్రవారం మొదలైన ఈ మ్యాచ్‌లో సౌతాఫ్రికా ఆల్‌రౌండర్ మార్కో యన్సెన్ బౌలింగ్‌లో మ్యాడిన్సన్ క్లీన్ బౌల్డ్ అయ్యాడు. ఫలితంగా, టెస్టు క్రికెట్‌లో అత్యధిక బంతులు ఎదుర్కొని డకౌటైన ఆస్ట్రేలియా ఓపెనర్‌గా నిలిచాడు. ఇంతకుముందు ఈ రికార్డు డేవిడ్ వార్నర్ (22 బంతులు) పేరిట ఉండేది. అంతేకాకుండా, 21వ శతాబ్దంలో ఒక టెస్ట్ ఓపెనర్ ఆడిన అత్యంత సుదీర్ఘ డకౌట్ ఇన్నింగ్స్ కూడా ఇదే కావడం గమనార్హం. 34 ఏళ్ల మ్యాడిన్సన్ చివరిసారిగా 2016 డిసెంబర్‌లో టెస్టు మ్యాచ్ ఆడాడు. ఆ తర్వాత 2025లో అతనికి వృషణాల క్యాన్సర్ నిర్ధారణ అయింది. కీమోథెరపీ తీసుకుని, వ్యాధిని జయించి మళ్లీ దేశవాళీ క్రికెట్‌లో రాణించి జట్టులోకి వచ్చాడు. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియాకు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. మరో ఓపెనర్ ట్రావిస్ హెడ్ (9) కూడా త్వరగానే ఔటయ్యాడు. క్యాన్సర్‌పై పోరాడి గెలిచి జట్టులోకి వచ్చిన మ్యాడిన్సన్ కథ స్ఫూర్తినిచ్చినా, మైదానంలో అతను నమోదు చేసిన ఈ చెత్త రికార్డు అతని పునరాగమనానికి చేదు జ్ఞాపకంగా మారింది.

# భువనేశ్వర్ రీఎంట్రీ వెనుక అసలు కారణమిదే.. బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ ఆసక్తికర వ్యాఖ్యలు!

- నాలుగేళ్ల తర్వాత భువనేశ్వర్‌కు టీమిండియాలో చోటు
- పునరాగమనానికి అనుభవం, ఐపీఎల్ ప్రదర్శనే కారణమన్న బ్యాటింగ్ కోచ్
- యువ బౌలర్లతో పాటు అనుభవజ్ఞులూ అవసరమన్న సితాన్షు కోటక్
- షమీ ఎంపికపై సెలెక్టర్లదే తుది నిర్ణయమని స్పష్టీకరణ
- షమీ కూడా బాగా ఆడుతున్నాడని వ్యాఖ్య



టీమిండియా సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్ నాలుగేళ్ల విరామం తర్వాత మళ్లీ భారత టీ20 జట్టులోకి వచ్చాడు. అతడి పునరాగమనానికి ఐపీఎల్‌లో అద్భుత ప్రదర్శనతో పాటు అపార అనుభవం కూడా కారణమని భారత జట్టు బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ వెల్లడించాడు. యువ బౌలర్లు బాగా రాణిస్తున్నప్పటికీ, కీలక సమయాల్లో అనుభవం కూడా అవసరమని అభిప్రాయపడ్డాడు.భువనేశ్వర్ కుమార్ చివరిసారిగా 2022 నవంబర్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన సిరీస్‌లో భారత్ తరఫున ఆడాడు. ఆ తర్వాత జాతీయ జట్టుకు దూరమైన అతడు.. ఐపీఎల్‌లో మాత్రం తన సత్తా చాటాడు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున ఆడుతూ 2025 సీజన్‌లో 17 వికెట్లు, 2026 సీజన్‌లో 28 వికెట్లు పడగొట్టాడు. రెండు సీజన్లలో కలిపి 45 వికెట్లు తీసి జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. ఆ రెండు సీజన్లలో ఆర్‌సీబీ వరుసగా ఐపీఎల్ టైటిళ్లు గెలుచుకుంది.ఇంగ్లండ్ పర్యటన సమయంలో జస్‌ప్రీత్ బుమ్రా అందుబాటులో లేకపోవడం, యువ బౌలర్లు ఎక్కువగా ఉండటంతో అనుభవజ్ఞుల అవసరం కనిపించిందని కోటక్ చెప్పాడు. యువ ఆటగాళ్లు బాగా ఆడుతూ జట్టులోకి వస్తున్నారని, అయితే కొన్ని సందర్భాల్లో అనుభవానికి కూడా ప్రాధాన్యం ఉంటుందని వివరించాడు. ఐపీఎల్‌లో భువనేశ్వర్ నిలకడగా రాణించడం కూడా అతడి ఎంపికకు కారణమై ఉండొచ్చని పేర్కొన్నాడు.మరో సీనియర్ పేసర్ మహమ్మద్ షమీ పునరాగమనంపై మాత్రం కోటక్ స్పష్టమైన వ్యాఖ్యలు చేయలేదు. షమీ కూడా మ్యాచ్‌లు ఆడుతూ బాగా రాణిస్తున్నాడని, అతడి ప్రదర్శనతో పాటు జట్టు అవసరాలను పరిగణనలోకి తీసుకుని సెలెక్టర్లు నిర్ణయం తీసుకుంటారని చెప్పాడు. తాను సెలెక్టర్‌ను కానందున షమీ ఎంపికపై తుది నిర్ణయం చెప్పలేనని స్పష్టం చేశాడు.వీవీఎస్ లక్ష్మణ్‌ను సెలక్షన్ సమావేశాల్లో భాగం చేయడం, జట్టు యాజమాన్యం నుంచి సెలెక్టర్లకు ఆటగాళ్ల గాయాల సమాచారాన్ని చేరవేసే బాధ్యత అప్పగించారన్న వార్తలపైనా కోటక్ స్పందించాడు. ఈ విషయం తనకు కూడా మీడియా ద్వారానే తెలిసిందని చెప్పాడు. బీసీసీఐ తీసుకున్న నిర్ణయం వెనుక సరైన కారణం ఉంటుందని భావిస్తున్నానని తెలిపాడు.

# శృతి హాసన్.. పర్సనల్ ఫ్రీడమ్ కు లిమిట్స్ ఎక్కడ?







హీరోయిన్లు తమ పర్సన్ లైఫ్ పై మాట్లాడటం కొత్తేమీ కాదు. కానీ కొన్ని విషయాలపై ఓపెన్ గా మాట్లాడితే మాత్రం వెంటనే డిబేట్ స్టార్ట్ అవుతుంది. ఇప్పుడు స్టార్ హీరోయిన్ శ్రుతి హాసన్ చేసిన కామెంట్స్ కూడా అలాంటి చర్చనే మొదలుపెట్టాయి. అయితే ఆమె చేసిన కామెంట్స్ కంటే.. దాని వెనుక ఉన్న ఆలోచన ఏంటనేదే అసలు అబ్జర్వ్ చేయాల్సిన విషయం.

శ్రుతి హాసన్ రీసెంట్ గా సెల్ఫ్ కేర్, పర్సనల్ ఫ్రీడమ్ వంటి విషయాలపై మాట్లాడారు. ఆ సమయంలో సెలిక్స్ టాయ్స్ ను కూడా సెల్ఫ్ కేర్ లో భాగంగా చూడొచ్చని ఆమె అభిప్రాయపడ్డారు. ఆ విషయంలో ఇతరుల పర్మిషన్ అవసరం లేదని, ప్రతి ఒక్కరూ తమ వ్యక్తిగత నిర్ణయాలను తామే తీసుకునే ఫ్రీడమ్ ఉండాలని చెప్పారు. ఇక్కడ శ్రుతి చెప్పిన అసలు పాయింట్ ఒక వస్తువు గురించి మాత్రమే కాదు.

మన పర్సనల్ లైఫ్ కు సంబంధించిన నిర్ణయాలపై సొసైటీ ఎంతవరకు ఎఫెక్ట్ చూపించాలనేదే ఆమె కామెంట్స్ లో కనిపిస్తున్న మెయిన్ ఎలిమెంట్. ముఖ్యంగా పర్సనల్ లైక్స్, రిలేషన్స్, బాడీ, ప్రైవసీ వంటి విషయాల్లో ఇతరులు చేసే జడ్జిమెంట్లకు భయపడకుండా.. తమకు ఏది కంఫర్ట్ గా ఉంటుందో దానిని వ్యక్తులు నిర్ణయించుకోవాలన్నది ఆమె అభిప్రాయంగా కనిపిస్తోంది.అయితే మన సొసైటీలో ఇలాంటి విషయాలు ఇప్పటికీ కామన్ గా మారలేదు. అందుకే శ్రుతి కామెంట్స్ బయటకు వచ్చిన వెంటనే ఆమె చెప్పిన విషయం కంటే.. ఆమె ఎందుకు ఇలా మాట్లాడారనే యాంగిల్ లో ఎక్కువగా చర్చ జరుగుతోంది. కొందరికి ఇది పర్సనల్ ఫ్రీడమ్ గురించి చెప్పిన జస్ట్ ఒపీనియన్ గా కనిపిస్తే.. మరికొందరికి మాత్రం ఇలాంటి విషయాలను బహిరంగంగా మాట్లాడటం అవసరమా అనే ప్రశ్న రావచ్చు.అందుకే శ్రుతి ఒపీనియన్ తప్పా? ఒప్పా? అనే విషయం ఇంట్రెస్టింగ్ గా మారింది. నిజానికి ఆమె కామెంట్స్ ను అందరూ ఒకే విధంగా చూడాల్సిన అవసరం లేదు. వ్యక్తిగత ఎంపికల విషయంలో ఎవరి అభిప్రాయం వారిదే. అయితే పర్సన్ ఫ్రీడమ్ అంటే బాధ్యత కూడా ఉండాలనే విషయం కూడా అంతే ముఖ్యమైనది. ఏ వ్యక్తిగత నిర్ణయమైనా అది తనకు, ఇతరులకు ఇబ్బంది కలిగించకుండా ఉండటం అవసరం.

మరోవైపు సెల్ఫ్ కేర్ అనే పదానికి కూడా అర్థం మారుతుంది. గతంలో ఇది హెల్త్, రెస్ట్, పీస్ ఫుల్ నెస్ వంటి విషయాలకే ఎక్కువగా పరిమితమయ్యేది. ఇప్పుడు పర్సనల్ కంఫర్ట్, ప్రైవసీ, ఎమోషనల్ నీడ్స్ అవసరాలు కూడా ఇందులో భాగంగా చర్చకు వస్తున్నాయి. శ్రుతి కామెంట్స్ ను కూడా మారుతున్న థింకింగ్ ప్రాసెస్ లో చూడొచ్చు.

అందుకే ఆమె మాటలను కేవలం బోల్డ్ కామెంట్స్ గా చూడటం కంటే.. పర్సనల్ ఫ్రీడమ్, ప్రైవసీ, సామాజిక తీర్పులపై ఆమె చెప్పిన అభిప్రాయంగా చూడటం బెటర్. అయితే యాక్సెప్ట్ చేయాలా లేక వ్యతరేకించాలా అనేది ఎవరి వ్యక్తిగత ఆలోచన వారిదే. కానీ సాధారణంగా మాట్లాడటానికి ఇబ్బంది పడే అంశంపై శ్రుతి మరోసారి తన అభిప్రాయాన్ని క్లియర్ గా చెప్పారని అనడంలో డౌట్ అక్కర్లేదు.

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At published at D V RAO, FLAT NO: 402, VIGNESWARA PRANATHI REDDY TOWERS, OPP. BHARAT PETROLBUNK, VIDYANAGAR, TIRUPATI Dist.,editor GANTYADA APPARAO. PRGI Registration No. "APTEL/25/A4409" e-mail :editorpenpower@gmail.com, Mobile: 9059465965